న్యూస్ బాక్స్

గ్రామ పంచాయతీ నిర్మాణానికి నిధులు ఇవ్వండి

● ఎమ్మెల్యేకు ఇందిరానగర్ గ్రామస్థుల వినతి


ఎమ్మెల్యేకు సమస్యలను విన్నవిస్తున్న గ్రామస్థులు

జగిత్యాల అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): బీర్‌పూర్ మండలం నర్సింహులపల్లి గ్రామ పంచాయతీ అనుబంధ గ్రామం ఇందిరానగర్ గ్రామ పంచాయతీ నిర్మాణానికి నిధులు మంజూరు చేయాలని గ్రామస్థులు గురువారం ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ వారి నివాస గృహంలో కలిసి వినతి పత్రం అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ఇందిరానగర్ గ్రామాభివృద్ధికి తన వంతుగా కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో కోడూరు ప్రభాకర్, నారపాక సుదర్శన్, కోడూరు రమేష్, నారపాక రమేష్, రాజ్ కుమార్ పాల్గొన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన జడ్పీ మాజీ చైర్‌పర్సన్

జగిత్యాల రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలం బాలపల్లి గ్రామానికి చెందిన తిరుపతిరెడ్డి ఎలక్ట్రిక్ బ్యాటరీ బైక్ పేలిన సమాచారం అందుకున్న మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంతసురేష్ ప్రమాదం జరిగిన స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కుటుంబసభ్యులను ఓదార్చారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి ప్రభుత్వం ద్వారా త్వరితగతిన బాధితులకు సహాయం అందించాలని కోరారు. ఈకార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు ఆనందరావు, నాయకులుగంగారెడ్డి, రవి, ప్రమోద్, బాలపల్లి గ్రామస్థులు పాల్గొన్నారు.



భూ సర్వేకు తప్పని నిరీక్షణ

● పెండింగ్‌లో అధిక దరఖాస్తులు
● అందుబాటులో లేని టిపన్‌లు
● ఆరు మండలాల్లో లేని సర్వేయర్లు
● సిబ్బంది సమస్య అదే తీరులో
● తీవ్ర ఇబ్బందుల్లో దరఖాస్తు దారులు

జగిత్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూమి కొలతల్లో వచ్చిన తేడాలను గుర్తించి సరి చేసుకునేందుకు సర్వే కోసం దరఖాస్తులు చేసుకున్న రైతులు సకాలంలో పరిష్కారం కాక నెలల తరబడి నిరీక్షిస్తున్నారు. సర్వే కార్యాలయాల చుట్టూ చెప్పులు అరిగేలా తిరుగుతున్నా సర్వే పూర్తి కావడం లేదు. సుమారు దశాబ్ధ కాలంగా గ్రామాలు, పట్టణ ప్రాంతాల్లో భూ క్రయ, విక్రయాలు పెరిగిపోయాయి. ధరణి పోర్టల్ వచ్చిన తదుపరి రికార్డులు, భూ కొలతల్లో చాలా వ్యత్యాసాలు వస్తున్నాయి. భూముల కొనుగోలు సమయంలో ఈ తేడాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దీంతో కొనుగోలు చేసిన వారు తాము ఖరీదు చేసిన దానికంటే కమతం తక్కువగా ఉందంటూ అధికారికంగా సర్వే చేయాలంటూ రెవెన్యూ, భూ కొలతల శాఖాధికారులకు దరఖాస్తులు అందిస్తున్నారు. జిల్లాలో అవసరాల మేరకు భూమి కొలతల అధికారులు, ఇతర సిబ్బంది లేకపోవడంతో కొలతల కోసం ఎదురుచూడాల్సి వస్తోంది.

జిల్లాలో 403 దరఖాస్తులు పెండింగ్...

జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు భూ సర్వేకు మీ సేవా కేంద్రాల ద్వారా 20,545 దరఖాస్తులు వచ్చాయి. ఇందులో 16,762 దరఖాస్తులను అధికారులు ఆమోదించి పరిష్కరించారు. మరో 3,380 దరఖాస్తులను వివిధ కారణాల వల్ల తిరస్కరించారు. జిల్లా వ్యాప్తంగా 403 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా మేడిపల్లి మండలంలో 1,808, మెట్‌పల్లిలో 1,630, కొడిమ్యాలలో 1,628 దరఖాస్తులు వచ్చాయి. అత్యల్పంగా ఎండపల్లిలో 144, బీమారంలో 154, బీర్‌పూర్‌లో 388 దరఖాస్తులు వచ్చాయి.

సర్వేయర్ల కొరత..

జిల్లాలో సర్వేయర్ల కొరత ఉన్నట్లు అధికారులు చెబుతున్నారు. జిల్లాలో ఇటీవల ఆవిర్భవించిన వాటితో కలిపి 20 మండలాలున్నాయి. ఇందులో ఆరు మండలాల్లో సర్వేయర్ల కొరత ఉంది. బీమారం, ఎండపల్లి, సారంగపూర్, మల్లాపూర్, బీర్‌పూర్, బుగ్గారం మండలాల్లో సర్వేయర్లు లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జిల్లా కేంద్రం మినహాయించి మండలానికి ఒకరు చొప్పన సర్వేయర్, ఇద్దరు చైన్ మెన్లను నియమించాల్సి ఉంది. ఆరు మండలాల్లో సర్వేయర్లు లేకపోవడంతో సమస్యలున్నాయి. జిల్లా కేంద్రంలో ఇద్దరు సర్వేయర్లు, ముగ్గురు డిప్యూటీ సర్వేయర్లు ఉండాల్సి ఉంది. సర్వేయర్లు, డిప్యూటీ సర్వేయర్ల నియామకం జరగడం లేదు. దీంతో ప్రైవేటు సర్వేయర్లను ఆశ్రయిస్తున్నారు.

అందుబాటులో లేని టిపన్లు..

జిల్లా వ్యాప్తంగా 7,05,922 ఎకరాల భూ విస్తీర్ణం ఉంది. ఇందుకు గాను 1,57,602 టిపన్‌లు ఉండాలి. జిల్లాలో కేవలం 97,000 టిపన్‌లు మాత్రమే అందుబాటులో ఉన్నాయి. సుమారు 60,602 టిపన్‌లు లేకపోవడంతో అధికారులు ఇబ్బందులకు గురవుతున్నారు. భూ సర్వే నంబరులోని కొలత రికార్డులను టిపన్ అంటుంటారు. భూముల కొలతలతో పాటు హద్దుల వివరాలు తెలిపేలా రికార్డుల ఆధారంగా గ్రామ పటం తయారు చేస్తారు. దీనినే టిపన్ (నక్ష)గా పిలుస్తారు. భూ సర్వేకు టిపన్ కీలకంగా ఉంటుంది. అటువంటి టిపన్‌లు అందుబాటులో లేకపోవడం భూ సర్వే పరిష్కారంపై ప్రభావాన్ని చూపుతున్నాయి. భూ సమస్యలపై మీ సేవ కేంద్రం ద్వారా వచ్చిన దరఖాస్తుల ఆధారంగా అధికారులు గ్రామాల టిపన్లు, రికార్డుల సాయంతో 45 రోజుల్లోగా సర్వే చేసి హద్దులు నిర్ణయించాల్సి ఉంటుంది.

(తరువాయి 8వ పేజీలో)

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

● కలెక్టర్ సత్యప్రసాద్


కొనుగోలు కేంద్రం వద్ద అధికారులకు సూచనలు చేస్తున్న కలెక్టర్

రాయికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కలెక్టర్ సత్యప్రసాద్ అన్నారు. రాయికల్ మండలంలోని రామారావుపల్లె-ఇటిక్యాల మధ్య జరుగుతున్న బ్రిడ్జి నిర్మాణ పనులను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. అలాగే మైతాపూర్ గ్రామంలో నిర్మిస్తున్న సీసీ రోడ్డు పనులను పరిశీలించి త్వరితగతిన పనులు పూర్తయ్యేలా చూడాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలను పరిశీలించారు. అంగన్‌వాడీ కేంద్రంలో పిల్లలకు పౌష్టికాహారం, బాలామృతం ఇస్తున్నారా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే గ్రామంలోని నర్సరీని సందర్శించి ప్రజలకు ఉపయోగపడే పండ్ల, పూల మొక్కలను పెంచాలని సూచించారు. అనంతరం వీరాపూర్ గ్రామంలోని పీఏసీఎస్, ఐపీపీ వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. సెంటర్లలో ట్యాబ్ డాటా ఎంట్రీ చేస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. తేమ వచ్చిన ధాన్యాన్ని కొనుగోలు చేసి రైస్‌మిల్లులకు తరలించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జివాకర్ రెడ్డి, జగిత్యాల ఆర్డీవో మధుసూదన్, తహసీల్దార్ ఖ య్యూం, ఈఈ అబ్దుల్ రహమాన్, ఎంపీడీవో చిరంజీవి, ఎంపీవో సుష్మా, సివిల్ సప్లై అధికారులు పాల్గొన్నారు.

టీపీసీసీ అధ్యక్షుడిని కలిసిన మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు


మహేశ్ కుమార్ గౌడ్‌ను కలిసిన విజయలక్ష్మీ

జగిత్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌ను గురువారం హైద్రాబాద్‌లో మహిళా కాంగ్రెస్ జగిత్యాల జిల్లా అధ్యక్షురాలు తాటిపర్తి విజయలక్ష్మీ దేవేందర్‌రెడ్డి కలిశారు. గాంధీ భవన్‌లో రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మొగిలి సునీతారావు అధ్యక్షతన జరిగిన సమీక్ష సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన మహేశ్ కుమార్ గౌడ్‌ను విజయ లక్ష్మీ దేవేందర్‌రెడ్డి కలిసి శుభాకాంక్షలు తెలిపారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ఇతర అంశాలను టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్‌కు ఆమె వివరించారు. ఈ కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ మహిళా విభాగం నాయకులు, పాల్గొన్నారు.

గ్రంథాలయ వారోత్సవాల్లో విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని స్థానిక జ్యోతి హైస్కూల్ ఐఐటీ అకాడమీకి చెందిన విద్యార్థులు జిల్లా గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా నిర్వహించిన పోటీల్లో అత్యంత ప్రతిభ కనబర్చారని పాఠశాల డైరెక్టర్ బియాల హరిచరణ్‌రావు తెలిపారు.గ్రంథాలయ వారోత్సవాల్లో నిర్వహించిన అన్ని పోటీల్లో జ్యోతి పాఠశాలకు చెందిన విద్యార్థులే అత్యధిక బహుమతులు సాధించడం హర్షణీయం అన్నారు. ఈ సందర్భంగా ప్రతిభ కనబర్చిన విద్యార్థులను అభినందించి శుభాకాంక్షలు తెలిపారు.

దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

:: ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్


క్రీడలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): దివ్యాంగులు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక వివేకానంద మినీ స్టేడియంలో అంతర్జాతీయ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా జిల్లా సంక్షేమశాఖ ఆధ్వర్యంలో దివ్యాంగుల క్రీడా మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ క్రీడా పోటీలను ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్‌కుమార్ చేతులమీదుగా జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సమాజంలో దివ్యాంగుల అందరితోపాటు సమానమేనని, ప్రభుత్వం దివ్యాంగులకు అండగా ఉంటుందన్నారు. తాను రాజకీయాల్లోకి రాకముందే రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో స్వచ్ఛంద సంస్థలతో దివ్యాంగులకు అనేక కార్యక్రమాలు నిర్వహించామన్నారు. బ్యాటరీ సైకిల్స్, కృత్రిమ కాలు, చేతు అవయవాలు అందజేశామన్నారు. డబుల్ బెడ్ రూం ఇళ్లలో 5శాతం దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించి మంజూరు చేశారన్నారు. క్రీడల ముగింపు సంబరాల్లో తన వంతుగా విజేతలకు బహుమతులు అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో డీబ్ల్యూవో నరేష్, ఎస్జీఎఫ్ సెక్రటరీ రాంనాయక్, బాలల సంరక్షణ అధికారి హరీష్, మెప్మా ఏవో శ్రీనివాస్ గౌడ్, డీవైఎస్‌వో రవి కుమార్, కౌన్సిలర్ చుక్క నవీన్‌తో పాటు పలు స్వచ్ఛంద సంస్థల బాధ్యులు పాల్గొన్నారు.

నియామకం


గుంటుక సురేశ్


వాసం సునీత

జగిత్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): టీఎస్ యూటీఎఫ్ కేజీబీవీ, యూఆర్‌ఎస్ విభాగం రాష్ట్ర కమిటీ సభ్యులుగా జిల్లాకు చెందిన డాక్టర్ గుంటుక సురేశ్, వాసం సునీతలు ఎన్నికయినట్లు జిల్లా టీఎస్ యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు తిరుక్కోవెల శ్యామ్ సుందర్, అంబటి భూమేశ్వర్‌లు గురువారం తెలిపారు. రాష్ట్ర రాజధానిలో జరిగిన ఎన్నికల్లో జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్‌కు చెందిన సీఆర్‌టీ డాక్టర్ గుంటుక సురేశ్, సారంగపూర్ కస్తూర్బా పాఠశాలలో హిందీ సీఆర్‌టీ వాసం సునీతలు ఏకగ్రీవంగా ఎన్నికయినట్లు వివ రించారు. వీరి ఎన్నికపట్ల జిల్లా కమిటీ పక్షాన శుభాకాంక్షలు తెలుపు తున్నామన్నారు.

కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

● డాక్టర్ ఉదయ్ కుమార్


రోగులను పరీక్షిస్తున్న రేకుర్తి వైద్యులు

రాయికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కంటి వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని డాక్టర్ ఉదయ్ కుమార్ అన్నారు. రాయికల్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో గురువారం కరీంనగర్ రేకుర్తి కంటి ఆస్పత్రి వైద్యులు పట్టణంలోని బాలుర పాఠశాలలో ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 134 మందికి కంటి పరీక్షలు చేయగా 44 మందిని ఆపరేషన్ కోసం గుర్తించి రేకుర్తి కంటి ఆస్పత్రికి పంపించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు మచ్చ శేఖర్, లయన్స్ క్లబ్ మాజీ డీసీ మ్యాకల రమేష్, రేకుర్తి ఆస్పత్రి వైద్యులు ప్రభాకర్, ప్రధాన కార్యదర్శి కడకుంట్ల నరేష్, కోశాధికారి కట్ల నర్సయ్య, ఉపాధ్యక్షుడు కుర్మ సుదర్శన్ రెడ్డి, లయన్స్ క్లబ్ సభ్యులు ఎద్దండి దివాకర్, అంజిరెడ్డి, సాంబారు శ్రీనివాస్, రాజేష్, శివ పాల్గొన్నారు.

ధర్మపురి ఆలయ అభివృద్ధికి సీఎం కృషి

● రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు


సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

7

తప్పుడు వైద్యం చేస్తే చర్యలు తప్పవు

● జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్


మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో ప్రమోద్ కుమార్

8

చెరువులు, కుంటలపై హక్కులు కల్పించింది కాంగ్రెస్

● చెరువుల శుద్ధి అంశాన్ని సీఎం దృష్టికి తీసుకెళ్తా
● ప్రపంచ మత్స్యకారుల దినోత్సవ వేడుకల్లో జీవన్‌రెడ్డి వ్యాఖ్యలు


చేపలతో ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): చెరువులు, కుంటలపై మత్స్యకారులకు హక్కులు కల్పించిన ఘనత స్వర్గీయ ఇందిరాగాంధీ, కాంగ్రెస్ పార్టీకే దక్కిందని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి అన్నారు. జిల్లా కేంద్రంలోని స్థానిక ఇందిరాభవన్‌లో ప్రపంచ మత్స్యకార దినోత్సవ వేడుకలు స్థానిక గంగపుత్ర సంఘ ప్రతినిధులచే వేడుకలు నిర్వహించగా, వేడుకల్లో పాల్గొన్న జీవన్‌రెడ్డి కేక్ కట్ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చెరువుల్లో నీరు ఉన్నంతకాలం మత్స్య కారుల సహకార సంఘానికే అధికారం ఉంటుందన్నారు. రాష్ట్ర సీఎం రేవంత్‌రెడ్డి చెరువులు, కుంటలు పునరుద్ధరించాలనే ఆలోచనతో హైడ్రాను తెరపైకి తెచ్చారన్నారు. అక్రమ నిర్మాణాల తొలగింపు, చెరువుల పునరుద్ధరణ ప్రధాన ధ్యేయంగా పార్టీ ముందుకు సాగుతుందన్నారు. చెరువులను కాపాడాల్సిన బాధ్యత రెవెన్యూ యంత్రాంగంపై ఉందన్నారు. తనకు నాలుగు దశాబ్దాలుగా మత్స్యకారులతో అనుబంధం ఉందని, పట్టణంలోని ధర్మసముద్రంలో చేపలను పెంచేందుకు హక్కులు కల్పించాలని గుర్తు చేశారు. రాష్ట్రంలో ఎక్కడా లేని విధంగా చేపల మాంస విక్రయాలకు ప్రత్యేక మార్కెట్లు చేశానని, చింతకుంట చెరువులో చేపల పెంపకానికి ప్రోత్సాహం అందించానన్నారు. ఏ హోదాలో ఉన్న లేకున్న నిరుపేదల హక్కుల పరిరక్షణకు పాటుపడడం తన బాధ్యతగా భావిస్తా నన్నారు. చెరువుల్లో గుర్రపు డెక్క తొలగింపునకు నిధులు కేటాయింపునకు హామీ ఇచ్చిన ఆయన, చెరువులు కుంటల శుద్ధి అంశాన్ని సీఎం రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్తానన్నారు. ఈ కార్యక్రమంలో మత్సకార సంఘ నాయకులు, సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యానికి ఆహారమే ప్రధానం


విద్యారులు చేసిన వంటలతో నోడల్ అధికారి వెంకటేశ్వర్లు

జగిత్యాల అగ్రికల్చర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఆరోగ్యం, శారీరక దృఢత్వానికి ఆహారం ప్రధానమని ఇంటర్మీ డియేట్ జిల్లా నోడల్ అధికారి వెంకటేశ్వర్లు అన్నారు. పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో బుధవారం నిర్వహించిన ఫుడ్ ఫెస్ట్ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడు తూఈ ఫెస్టివల్ నిర్వహణ వల్ల విద్యార్థులు వంటలు వండే విధానంతో పాటు, తినే ఆహారాన్ని ఇతరులతో పంచుకునే విషయాన్ని నేర్చుకుం టారన్నారు. సాత్విక ఆహారంతో విద్యార్థుల్లో ఏకాగ్రత పెరుగుతుంద న్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్‌తో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మత్స్యకారులకు అండగా తెలంగాణ ప్రభుత్వం

● త్వరలో గంగపుత్రులకు మోపెడ్లు, సేఫ్టీ కిట్‌లు
● ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్


ఎమ్మెల్యేకు చేపలు అందజేస్తున్న మత్స్యకారులు

జగిత్యాల అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని మత్స్యకారులకు అండగా రాష్ట్ర ప్రభుత్వం నిలుస్తుందని, త్వరలోనే గంగపుత్రులకు మోపెడ్లు, సేఫ్టీ కిట్లు అందజేస్తామని జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్ అన్నారు గురువారం జగిత్యాల పట్టణ గల్ఫ్ గంగపుత్ర సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవ కార్యక్రమంలో పాల్గొని జెండా ఆవిష్కరించిన ఆయనకు గంగపుత్ర సంఘం సభ్యులు చేపలు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో మత్స్యకారులు చనిపోతే ఎలాంటి కాలయాపన లేకుండా రూ.5 లక్షల ఇన్సూరెన్స్ చెక్కులు అందజేస్తున్నామని, ఇటీవల మరణించిన 8 మంది మత్స్యకారుల కాపీలు కలెక్టర్ కార్యాల యంలో తయారవుతున్నాయన్నారు. బఫర్ జోన్, చెరువులు, కుంటల్లో ఎలాంటి అక్రమ నిర్మాణాలు చేయరాదని, ఈ విషయమై ఎలాంటి సమస్య ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఈ కార్యక్రమంలో గల్ఫ్ గంగపుత్ర సంఘం అధ్యక్షుడు తిరుపతి, కౌన్సిలర్ జుంబర్తి రాజ్ కుమార్, ఎఫ్‌సీఎస్ సంఘం అధ్యక్షుడు గుమ్మల అంజయ్య, ఎఫ్‌సీఎస్ డైరెక్టర్ ఆరుముల్ల పవన్, నాచుపల్లి రెడ్డి, రాజరెడ్డి పాల్గొన్నారు.

పుట్టిన ఊరు కన్న తల్లిలాంటిది

జగిత్యాల రూరల్: పుట్టిన ఊరు కన్నతల్లి లాంటిదని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం అంతర్గాం గ్రామంలో స్వంత ఖర్చులతో ప్రైమరీ స్కూల్‌లో టీవీ ప్రొజెక్టర్‌ను అందించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామంలో అన్ని వర్గాల ప్రజల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. గ్రామంలో 100డబుల్ బెడ్‌రూం పనులు పూర్తి కావచ్చాయన్నారు. నియోజకవర్గానికి 1500 మంజూరు కాగా జగిత్యాలలో డబుల్ బెడ్ రూంల నిర్మాణం పూర్తయిందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రవీందర్‌రెడ్డి, బోనగిరి నారాయణ, రాజిరెడ్డి, భూపెల్లి శ్రీనివాస్, శ్రీనివాస్, సోముల శేఖర్‌రెడ్డి, ఎంపీడీవో రమాదేవి, ఎంఈవో గాయిత్రి, ప్రిన్సిపాల్ మహిపాల్‌రెడ్డి, సీడీపీవో మమత పాల్గొన్నారు.

ప్రమాదకరంగా విద్యుత్ లైన్లు

- భయాందోళనలో ప్రజలు
- అధికారులు చర్యలు తీసుకోవాలని వినతి



రుక్మాపూర్‌లో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ లైన్లు

చొప్పదండి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): చొప్పదండి మండలంలోని రుక్మాపూర్ నుంచి కాట్నపల్లి దారిలో విద్యుత్ లైన్లు ప్రమాదకరంగా మారాయి. ఒక లైన్ మీదుగా మరో లైన్ వెళ్తోంది. మోడల్ స్కూల్ వైపుకు వెళ్ళే ఎక్స్‌ప్రెస్ ఫీడర్ పై నుంచి కాట్నపల్లి లైన్ పోతున్నది. దీంతో రెండు కలిసిపోయే ప్రమాదం ఉంది. స్తంభం ఒక వైపుకు ఒరిగిపోగా విద్యుత్ తీగలు సమీపంలోకి వచ్చాయి. తీవ్రమైన గాలి వీస్తే వైర్లు తాకితే మంటలు చెలరేగే ప్రమాదం ఉంది. గతంలో రెండు లైన్లు కలిసిపోయిన చోట విధుల్లోఉన్న హెల్పర్ విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. ప్రమాదం చోటు చేసుకున్నా విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

మినీ స్టేడియం నిర్మాణం పూర్తయ్యేనా?

- శంకుస్థాపన చేసి ఏడాదైనా కదలని పనులు
- ఇబ్బందులు పడుతున్న క్రీడాకారులు

హుజూరాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): హుజూరాబాద్‌లో మినీ స్టేడియం నిర్మాణానికి మోక్షం కలగకపోవడంతో క్రీడాకారులకు తిప్పలు తప్పడం లేదు. హుజూరాబాద్ క్రీడలకు పేరుంది. క్రీడాకారుల సంఖ్య కూడా అధికంగానే ఉంది. కాగా మినీ స్టేడియం లేని కారణంగా క్రీడాకారులు సాధన చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు. హుజూరాబాద్‌లో మినీ స్టేడియం నిర్మాణం చేపట్టాలని గత 20ఏళ్లుగా డిమాండ్ ఉంది. గతంలో మాజీ మంత్రి ఇనుగాల పెద్దిరెడ్డి మినీ స్టేడియం ఏర్పాటు చేస్తానని హామీ ఇవ్వగా అలాగే మిగిలిపోయింది. మండలానికో స్టేడియం ఉండాలనే ప్రభుత్వ నిబంధనలతో 2023లో అసెంబ్లీ ఎన్నికల ముందు ఎమ్మెల్సీగా ఉన్న పాడి కౌశిక్‌రెడ్డి మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, అర్బన్ డెవలప్‌మెంట్ కింద రూ. 10కోట్ల వ్యయంతో హుజూరాబాద్ హైస్కూల్ మైదానంలో మినీ స్టేడియంకు శంకుస్థాపన చేశారు. జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో హుజూరాబాద్ ఎమ్మెల్యేగా పాడి కౌశిక్‌రెడ్డి గెలిచినా రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం పరాజయం కాగా, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. దీంతో మినీ స్టేడియం నిర్మాణానికి మోక్షం లేకుండా పోయింది.



హుజూరాబాద్‌లో మినీ స్టేడియం ఏర్పాటు చేసే హైస్కూల్ మైదానం

క్రీడలకు అడ్డాగా హుజూరాబాద్

హుజూరాబాద్‌కు క్రీడలకు అడ్డాగా గుర్తింపు ఉంది. ఇక్కడి హైస్కూల్ మైదానంలో నిత్యం వందలాది మంది క్రీడకారులు సాధన చేస్తుంటారు. హాకీ, కబడ్డీ, క్రికెట్, ఖోఖో, వాలీబాల్ తదితర క్రీడల్లో రాణిస్తున్నారు. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయిల్లో కూడా ప్రతిభ కనబరుస్తున్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని హుజూరాబాద్ పట్టణానికి నడిబొడ్డున హైస్కూల్ మైదానం ఉండడంతో అందరికీ ఉపయోగకరంగా ఉంటుందని రూ. 10 కోట్ల వ్యయంతో మినీ స్టేడియం ఏర్పాటుకు శంకుస్థాపన చేశారు. హైస్కూల్ మైదానాన్ని మినీ స్టేడియంగా మార్చి అందులో హాకీ, కబడ్డీ, వాలీబాల్ తదితర కోర్టులను ఏర్పాటుకు మ్యాప్ కూడా సిద్ధం చేశారు. మినీ స్టేడియం ఏర్పాటు కాకపోవడంతో ఉదయాన్నే మైదానానికి వచ్చే వాకర్స్‌కు, క్రీడాకారులకు ఇబ్బందిగా మారింది. క్రీడాకారులకు సౌకర్యార్థం మంత్రులు పొన్నం ప్రభాకర్, శ్రీధర్‌బాబు, జిల్లా అధికారులు చొరవ తీసుకొని మినీ స్టేడియం నిర్మాణం త్వరితగతిన పూర్తి చేయాలని క్రీడాకారులు కోరుతున్నారు.

క్రీడాకారులకు శాపంగా మారిన మినీ స్టేడియం

- బండ కిషన్, క్రీడాకారుడు, హుజూరాబాద్



హుజూరాబాద్ మినీ స్టేడియం నిర్మాణానికి పునాదులు పడకపోవడంతో క్రీడాకారులకు శాపంగా మారింది. హుజూరాబాద్‌లో క్రీడాకారులకు కొదువ లేదు. ఈ ప్రాంతం నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయి క్రీడాకారులు ఎంతో మంది ఉన్నారు. మినీ స్టేడియం నిర్మిస్తే మరింత మందిని ఉత్తమ క్రీడాకారులుగా తీర్చిదిద్దే అవకాశం ఏర్పడుతుంది. మంత్రులు, జిల్లా అధికారులు కృషి చేసి మినీ స్టేడియం నిర్మాణం త్వరితగతిన చేపట్టాలి.

కొండగట్టులో దీపారాధన



కొండగట్టులో దీపాలు వెలిగిస్తున్న అడిషనల్ కమిషనర్

మల్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో నిర్వహిస్తున్న కార్తికదీపోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆలయంలో గురువారం భక్తులతో కలిసి కరీంనగర్ దేవాదాయశాఖ అడిషనల్ కమిషనర్ సుప్రియ కార్తీక దీపాలు వెలిగించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు జరిపారు. ఈవో రామకృష్ణరావు, పర్యవేక్షకులు హరిహరనాథ్, అర్చకులు, వేదపండితులు, ఆగమ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు

అంజన్న ఆలయం హుండీ లెక్కింపు

మల్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానానికి హుండీల ద్వారా రూ.1,04,36,365 నగదు ఆదాయం సమకూరినట్లు ఈవో ఎం.రామకృష్ణ రావు తెలిపారు. 75 రోజులకు గాను ఆలయంలోని 12 హుండీలను విప్పి గురువారం లెక్కింపు చేయగా నగదుతో పాటు 60 గ్రాముల మిశ్రమ బంగారం, 3కిలోల మిశ్రమ వెండి, 78విదేశీ కరెన్సీ లభించినట్లు ఈవో తెలిపారు. ఈ లెక్కింపులో కరీంనగర్ ఏసీ సుప్రియ, ఏఈవో వై. అంజయ్య, పర్యవేక్షకులు సునీల్, చంద్రశేఖర్, హరిహరనాథ్, అధికారులు, సిబ్బంది, శ్రీలలిత సేవా ట్రస్ట్ సభ్యులు లెక్కింపులో పాల్గొన్నారు.



హుండీ సొమ్ములు లెక్కిస్తున్న సిబ్బంది

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ఇద్దరికి తీవ్రగాయాలు



రమేశ్(ఫైల్)

వేములవాడ టౌన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన మ్యాకల రమేశ్ (27) గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. గ్రామస్థులు, బాధితులు తెలిపిన వివరాల ప్రకారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని కొనాయపల్లి గ్రామానికి చెందిన మ్యాకల నర్సయ్య, లచ్చవ్వ దంపతులకు ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. పది సంవత్సరాల క్రితం కుమారుడు, కూతురు మృతి చెందడంతో ఇద్దరే ఉంటూ వచ్చారు. చందుర్తి మండలం రామరావుపల్లి గ్రామానికి చెందిన తమ సమీప బంధువు సాయిలు-సుగుణ దంపతుల చిన్న కుమారుడు రమేష్‌ను మూడు సంవత్సరాల క్రితం దత్తత తీసుకున్నారు. రెండు సంవత్సరాల క్రితం రమేష్‌కు అంగరంగ వైభవంగా వివాహం చేశారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని శాత్రాజుపల్లి గ్రామ శివారులోని పెట్రోల్‌బంక్‌లో ఉపాధి కోసం పని చేస్తున్నాడు. కొడిమ్యాల మండల కేంద్రానికి చెందిన శాంసన్, వట్టెంల గ్రామానికి చెందిన సాయి అనే యువకులతో కలిసి శాత్రాజుపల్లి వైపు ద్విచక్రవాహనంపై వెళుతుండగా గుర్తు తెలియని వాహనం ఢీకొట్టింది. ఈ సంఘటనలో మ్యాకల రమేష్‌కు తలకు తీవ్రగాయాలతో మృతి చెందాడు. శాంసన్, సాయిలకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. కొడుకులు లేరని దత్తత తీసుకున్న తల్లిదండ్రులు, మంచిగా బతకాలని దత్తత ఇచ్చిన కన్న తల్లిదండ్రులు కొడుకు అకాల మరణంతో రోదించిన తీరుకు స్థానికులు కన్నీటి పర్యంతం అయ్యారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని ఒకరు..

మానకొండూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని శంషాబాద్ బస్టాండ్ వద్ద గురువారం మోటార్ సైకిల్‌ను ఆర్టీసీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ వ్యక్తి అక్కడికక్కడే మృతి చెందాడు. శంకరపట్నం మండలంలోని చింతగట్టు గ్రామానికి చెందిన కర్క మల్లారెడ్డి (68) అనే రైతు మోటార్‌సైకిల్(టీఎస్ 02ఈకే 8607)పై మండలంలోని గట్టుదుద్దెనపల్లి పెట్రోల్ బంక్‌లో పెట్రోల్ పోసుకొని ఇంటికి తిరిగి వెళుతున్నాడు. వరంగల్ నుంచి కరీంనగర్ వైపు వస్తున్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు (టీఎస్ 23 జడ్ 0015) ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో మల్లారెడ్డి తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకొని వివరాలు తెలుసుకున్నారు. మల్లారెడ్డి భార్య కర్క విజయలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ లక్ష్మీనారాయణ తెలిపారు.

మానేరు నీటిలో మునిగి యువకుడు..



అనిల్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణ శివారులోని మానేరు కరకట్ట వద్ద కోనరావుపేట మండలంలోని నిజామాబాద్ గ్రామానికి చెందిన జంగిలి అనిల్(37) అనే యువకుడు ప్రమాదవశాత్తు నీటిలో మునిగి మృతి చెందాడు. టౌన్ సీఐ కె కృష్ణ వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలంలోని మండెపల్లి గ్రామానికి తన తండ్రి బాగా లేడని చూసేందుకు ఇటీవల వచ్చాడు. తిరిగి ఈనెల 19న తెల్లవారుజామున నిజామాబాద్ వెలుతున్నానని చెప్పి ప్రమాదవశాత్తు మానేరు నీటిలో గురువారం శవమై తేలాడు. అనిల్‌కు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు. నిజామాబాద్‌కు ఇల్లరికం వచ్చి ఇక్కడే ఉంటున్న తన భర్త అనిల్ తండ్రిని చూసి వస్తానని మండెపల్లికి వెళ్లాడని, తిరిగి వస్తూ చేపల వేటకు మానేరులోకి దిగి ఊపిరాడక నీటిలో మునిగి మృతిచెందాడని భార్య గీత పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

విద్యుదాఘాతంతో వానరం మృతి



మృతి చెందిన వానరం

రామడుగు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గోపాల్‌రావుపేట గ్రామంలో గురువారం విద్యుదాఘాతంతో వానరం మృతి చెందింది. గ్రామంలోని ట్రాన్స్‌ఫార్మర్ నుంచి ఉన్న విద్యుత్ వైర్లను వానరం పట్టుకొని స్తంభం ఎక్కే సమయంలో షాక్‌కు గురై తగిలి అక్కడికక్కడే మృతి చెందింది. వానరం మృతి విషయం తెలుసుకున్న సామాజిక కార్యకర్త ఎడవెల్లి మహిపాల్‌రెడ్డి విద్యుత్ శాఖాధికారులతో మాట్లాడి సరఫరాను నిలిపివేయించారు. అనంతరం గ్రామస్థుల సహాయంతో వానరాన్ని ఖననం చేశారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు

మంథని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని విలోచవరం క్రాస్‌రోడ్డు రోడ్డు ప్రమాదంలో గురువారం దంపతులకు గాయాలయ్యాయి. మండలంలోని గుంజపడుగు ప్రాథమిక పాఠశాలలో విధులు ముగించుకొని టీచర్ అగజ తన భర్త గంగారెడ్డితో కలిసి ద్విచక్ర వాహనంపై వస్తుండగా మంథని-గోదావరిఖని ప్రధాన రహదారి ఎక్కే క్రమంలో విలోచవరం క్రాస్‌రోడ్డు వద్ద ఇసుక ట్రాక్టర్ ఢీకొట్టింది. దీంతో వారు కింద పడటంతో తలకు, శరీరంలో పలుచోట్ల గాయాలయ్యాయి. వారిని చికిత్స కోసం మంథని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

వాట్సప్‌కు ఎస్‌బీఐ పేరిట లింక్‌లు

మల్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వాట్సప్‌లో ఎస్‌బీఐ పేరిట వచ్చిన ఏపీకే లింక్‌లు సెల్‌ఫోన్ వినియోగదారులను ఆందోళన గురి చేశాయి. ఎస్‌బీఐ కేవైసీ చేసుకోవాలని వచ్చిన లింక్‌లతో పలువురి ఫోన్‌లు హ్యాక్ అయ్యాయి. మండలంలోని ముత్యంపేటకు చెందిన యాల్ల మధురెడ్డికి చెందిన వాట్సప్ హ్యాక్ కావడంతో అతని నంబరు గల వారందరితో పాటు వందలాది గ్రూప్‌లకు గురువారం వేకువజామున ఎస్‌బీఐ పేరిట లింక్‌లు వచ్చాయి. కాగా ఇటీవల ఏపీకే పేరిట వచ్చె వాటిని ఓపెన్ చేయవద్దనే సూచనలతో సెల్‌ఫోన్ వినియోగదారులు అప్రమత్తం అయ్యారు. వెంటనే వాటిని తొలగించి మధురెడ్డికి సమాచారం అందించారు. దీంతో అతను వాట్సప్ ఫోన్ నుంచి అన్ఇన్‌స్టాల్ చేసి మళ్లీ ఇన్‌స్టాల్ చేసుకున్నాడు. అప్పటికే కొందరు ఓపెన్ చేసినట్లు తెలిసింది.

రోడ్డు ప్రమాదంలో నలుగురికి గాయాలు

శ్రీరాంపూర్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారి-363పై గురువారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు గాయపడ్డారు. గోదావరిఖనికి చెందిన నలుగురు కారులో కన్నెపల్లి మండలంలోని ఎల్లారం పోచమ్మ ఆలయానికి దర్శనం నిమిత్తం వెళ్లారు. తిరుగు ప్రయాణంలో శ్రీరాంపూర్ వద్దకు రాగానే జాతీయ రహదారిపై ముందు ప్రయాణిస్తున్న ఎక్స్‌కావేటర్(జేసీబీ)ను ఢీకొట్టారు. దీంతో కారు హైవే దిగి కింద ఉన్న సర్వీస్ రోడ్డుపైకి వెళ్లింది. కారు బెలూన్లు తెరచుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. నలుగురికి గాయాలు కావడంతో క్షతగాత్రులను మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రమాదానికి గురైన కారు రోడ్డు మధ్యలో ఉండడంతో ఢీకొన్న ఎక్స్‌కావేటర్‌తోనే పక్కకు తొలగించారు. ప్రమాదంపై ఎవరూ ఫిర్యాదు చేయలేదని ఎస్‌ఐ సంతోష్ తెలిపారు.

బైక్ అదుపు తప్పి గాయాలు

భీమారం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద గురువారం బైక్ అదుపు తప్పి కింద పడిన ఘటనలో గోదావరిఖనికి చెందిన జక్కుల ఐలయ్య, గాదె పోశంలు తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గోదావరిఖనికి చెందిన ఐలయ్య పోశంలు చెన్నూరుకు వెళ్తుండగా ఆరేపల్లి ఎక్స్‌రోడ్డు వద్ద కుక్క అడ్డు రావడంతో బైక్ అదుపు తప్పి కిందపడ్డారు. దీంతో పోశంకు తీవ్ర గాయాలు కాగా ఐలయ్యకు స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు 108 అంబులెన్స్ ద్వారా మంచిర్యాల ఆసుపత్రికి తరలించారు.

ఎక్సైజ్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించండి

- ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ వీబీ కమలాసన్‌రెడ్డి

కరీంనగర్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ నేరాల నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్ డివిజన్ ఎక్సైజ్ అధికారులతో గురువారం ఎక్సైజ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టర్ విబి కమలాసన్‌రెడ్డి కరీంనగర్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. కరీంనగర్, పెద్దపల్లి, జగిత్యాల, రాజన్న సిరిసిల్లాల ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో జరుగుతున్న పనితీరుపై ఆయన సమీక్షించారు. మొదట ఆయన ఎక్సైజ్ పోలీసుల గౌరవ వందనం స్వీకరించారు. మాట్లాడుతూ ఎక్సైజ్ అధికారులు డ్రగ్స్, గంజాయి, నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌తోపాటు నాటుసారా తయారీ, రవాణా, అమ్మకాలపై ప్రత్యేకంగా నిఘా పెట్టాలన్నారు. వీటితోపాటు పోలీసుఠాణాలలో వివిధ కేసుల్లో పట్టుబడిన గంజాయి, డ్రగ్స్‌ను డిస్పోజల్ అధికారి అనుమతితో కాల్చివేయాలని అన్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం రాకుండా చర్యలు పేట్టాలన్నారు. స్టేషన్లలో చార్జీషీట్ వేయని కేసుల్లో వెంటనే చార్జీషీట్స్ వేయాలని, కేసుల్లో శిక్షలు పడేవిధాంగా చర్యలు చేపడితే ఎక్సైజ్ క్రైమ్ చేయాలంటే నేరస్థులు భయపడుతారని అన్నారు. మద్యం ఎంఆర్‌పీ ధరలు కంటే ఎక్కువ ధరలకు అమ్మకాలు జరిపే విషయంపై కూడా చర్యలు చేపట్టాలన్నారు. సమావేశంలో కరీంనగర్ డిప్యూటీ కమిషనర్ టి డెవిడ్ రవికాంత్, అసిస్టేంట్ కమిషనర్ కె వరప్రసాద్, కరీంనగర్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, పెద్దపల్లి ఎక్సైజ్ సూపరింటెండెంట్లు పి శ్రీనివాసరావు, ఏ సత్యనారాయణ, ఎస్ పంచాక్షరీ, ఆర్ మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

కాల్వశ్రీరాంపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఇదిలాపూర్‌కు చెందిన మహిళ చికిత్స పొందుతూ మృతిచెందింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శివరాత్రి వివాహిత స్వప్న(35)ను కాల్వశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన ధారంగుల రాజయ్య ఎప్పుడు ఫోన్‌చేసి అసభ్యకర మాటలు మాట్లాడడం వలన ఈనెల 18న తన ఇంటిలో పురుగుల మందు తాగింది. కుటుంబ సభ్యులు స్వప్నను కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందింది. మృతురాలి తల్లి పోచమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వెంకటేష్ తెలిపారు.

జాతీయ ఉత్తమ బాల పురస్కార్ అవార్డు అందజేత



అవార్డు అందుకుంటున్న జ్యోతిక

సుల్తానాబాద్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కరోనా విపత్కర సమయంలో చేసిన సేవా కార్యక్రమాలతోపాటు దుబారా ఖర్చులు వద్దని చేస్తున్న ప్రోగ్రాంలకు గాను సుల్తానాబాద్‌కు చెందిన చిన్నారులు ఏగోలపు జ్యోషిక, ఏగోలపు కౌశిక్‌లకు జాతీయ ఉత్తమ బాల పురస్కార్ అవార్డు-2024 అందించారు. మార్క్ గ్లోబల్ ఫౌండేషన్ అధ్యక్షురాలు నీరజ గొనె, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ చేరిపెల్లి దినేష్ ఆధ్వర్యంలో హైదరాబాద్ రవీంద్ర భారతిలో గురువారం నిర్వహించిన బాలల దినోత్సవ అవార్డు కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా మాజీ స్పీకర్ మధుసూదనాచారి, తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, పుష్పచంద్రశేఖర్‌లు అవార్డు అందించారు.

నాచుపల్లి జేఎన్‌టీయూలో విద్యార్థి అదృశ్యం

కొడిమ్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాచుపల్లి జేఎన్‌టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో మెకానికల్ ఇంజనీరింగ్ రెండో సంవత్సరం చదువుతున్న ఎ హితేష్ అదృశ్యమైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ బి ప్రభాకర్ తెలిపారు. హితేష్ ఈ నెల 19న అనుమతి లేకుండ హాస్టల్ నుంచి వెళ్లినట్లు తెలిపాడు. హాస్టల్ కేర్ టేకర్, తోటి విద్యార్థుల ద్వారా అదృశ్యం విషయం తెలుసుకొని కొడిమ్యాల పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు ప్రిన్సిపాల్ తెలిపారు. హితేష్ ఆంధ్రప్రదేశ్‌లోని పార్వతీపురం జిల్లా దరువుబిల్లి మండలం రావివలస గ్రామానికి చెందినవాడని చెప్పారు. విద్యార్థి దృశ్యంపై గురువారం మల్యాల సీఐ నీలం రవి, కొడిమ్యాల హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు విచారణ చేపట్టారు. ఈ మేరు అదృశ్యం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని హెడ్ కానిస్టేబుల్ అర్షరాజు తెలిపారు.


గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు పశువులు మృతి

సిరిసిల్ల క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): సిరిసిల్ల పట్టణం మొదటి బైపాస్ రహదారిలో సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం ఎదురుగా గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియని వాహనం ఢీకొని రెండు పశువులు మృతిచెందాయి. పట్టణంలోని శాంతినగర్‌కు చెందిన దూమాల రంజిత్ అనే రైతుకు చెందిన అయిదు పశువులు(బర్రెలు) రహదారి వైపునకు మేతకు వెళ్లాయి. గుర్తుతెలియని వాహనం ఢీకొనగా రెండు అక్కడికక్కడే మృతిచెందగా మరో మూడు పశువులు తీవ్రంగా గాయపడ్డాయి.

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

ఉమ్మడి జిల్లా పరిధిలో వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్యకు పాల్పడ్డారు. రాజన్నసిరిసిల్ల జిల్లా కేంద్రంలో పెళ్లి కావడం లేదని యువకుడు ఉరివేసుకున్నాడు. కోనరావుపేట మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి ఓ వ్యక్తి అనారోగ్యంతో మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకున్నాడు. మల్లాపూర్ మండలంలోని మొగిలిపేట కు చెందిన ఓ యువకుడు దుబాయ్‌లో బలవన్మరణానికి పాల్పడ్డాడు. తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఓ వ్యక్తి కుటుంబ కలహాలతో ఉరివేసుకున్నాడు.

- పెళ్లి కావడం లేదని యువకుడి ఆత్మహత్య



సంతోష్(ఫైల్)

సిరిసిల్ల క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తల్లిదండ్రులు పెళ్లి చేయడం లేదని మనస్తాపం చెందిన రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని నెహ్రూనగర్‌కు చెందిన దంపెటి సంతోష్ (25) అనే యువకుడు బుధవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల వివరాల ప్రకారం... పట్టణం లోని నెహ్రూనగర్‌కు చెందిన నేత కార్మిక కుటుంబమైన దుంపెటి లలిత, భూమయ్య దంపతులకు ఇద్దరు కూతుళ్లు, ఒక కుమారుడు ఉన్నారు. నేత కార్మికుడైన భూమయ్య పవర్‌లూం పని చేస్తూ అప్పుడప్పుడు కూలీకి వెళ్తుంటాడు. ఇద్దరు కూతుళ్లకు పెళ్లి చేయడంతో ఐదు లక్షల రూపాయలకు పైగా అప్పులు అయ్యాయి. కుమారుడు సంతోష్ ప్లంబింగ్ పని చేస్తుంటాడు. పెళ్లి చేయాలని తరుచుగా తల్లిదండ్రులను అడిగినప్పటికీ అప్పులు కావడంతో ఇప్పుడే ఎందుకని చెప్పడంతో సంతోష్ మద్యానికి బానిసయ్యాడు. మద్యం తాగుతున్నాడని కుమారుడికి ద్విచక్రవాహనం ఇవ్వడం మానేశారు. ఇప్పట్లో తనకు పెళ్లిచేయరని మనస్తాపం చెందిన తల్లిదండ్రులు ఉన్న గదికి తాళం వేసి మరో గదిలో సంతోష్ ఫ్యాన్‌కు ఉరివేసుకొని బల వన్మరణానికి ఒడిగట్టాడు. కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ కె కృష్ణ తెలిపారు.

- అనారోగ్యంతో మనస్తాపం చెంది..

కోనరావుపేట, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నిమ్మపల్లి గ్రామానికి చెందిన మానుపాటి చంద్రయ్య (57) అనే వ్యక్తి గురువారం ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసుల కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన చంద్రయ్య కొన్ని రోజులుగా కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నాడు. ఆసుపత్రుల్లో చూపించినా నయం కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది ఇంట్లో ఎవరు లేని సమయంలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ విషయమై భార్య లక్ష్మి పోలీసులకు సమాచారం అందించగా ఎస్సై ప్రశాంత్‌రెడ్డి చేరుకొని ఆత్మహత్యకు గల కారణాలను పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు రాజు, శంకర్ ఉన్నారు.

- దుబాయ్‌లో మొగిలిపేట వాసి బలవన్మరణం



శ్రీనివాస్(ఫైల్)

మల్లాపూర్, నవంబరు, 21 (ఆంధ్రజ్యోతి): మల్లాపూర్ మండలంలోని మొగిలిపేటకు చెందిన ఓ యువకుడు దుబాయ్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మొగిలిపేట గ్రామానికి చెందిన దండ్ల శ్రీనివాస్ (34) అనే యువకుడు మూడేళ్ల క్రితం జీవనోపాధి కోసం దుబాయ్ వెళ్లాడు. పనులు ముగియగానే లీవు దొరకగానే ఇంటికి తిరిగి వస్తానని చెప్పిన యువకుడు దుబాయిలో ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నట్లు స్నేహితులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వృద్ధురాలైన తల్లి, భార్య, పిల్లలు కన్నీరు మున్నీరుగా విలపించారు. లీవు దొరికితే ఇంటికి వస్తానని భార్య పిల్లలతో ఫోన్‌లో మాట్లాడిన శ్రీనివాస్ బలవన్మరణం పొందిన సమాచారం తెలియడంతో కుటుంబ సభ్యులు, బంధువుల్లో విషాదం నెలకొంది. శ్రీనివాస్ మృతదేహాన్ని స్వగ్రామానికి త్వరగా తెప్పించాలని, బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని వడ్డెర సంఘం నాయకులు మోహన్, సాయిరామ్, తదితరులు ప్రభుత్వాన్ని కోరారు.

- కుటుంబకలహాలతో ఆటో డ్రైవర్ ఆత్మహత్య

తంగళ్లపల్లి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో తంగళ్లపల్లి మండలం జిల్లెల్ల గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఎస్‌కె అన్వర్(33) ఆత్మహత్యకు పాల్పడ్డాడు. బంధువుల కథనం ప్రకారం.. జిల్లెల్ల గ్రామానికి చెందిన అన్వర్ కొద్ది సంవత్సరాల క్రితం ఉపాధి నిమిత్తం కుటుంబంతో సిద్దిపేటకు వలస వెళ్లి ఆటో డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. ఈ క్రమంలో భార్య భర్తల మధ్య తరుచుగా గొడవలు జరుగుతున్నాయి. వారం రోజుల క్రితం అన్వర్ భార్య ఆఫ్రీన్, ఇద్దరు కుమార్తెలు సాన(9), ఆయూషు(7), కుమారుడు ఇమామ్(2)ను తీసుకుని భర్త నుంచి దూరంగా వెళ్లిపోయింది. భార్య పిల్లలు వెళ్లిపోవడంతో తీవ్ర మనస్తాపం చెందిన అన్వర్ సిద్దిపేట నుంచి నాలుగు రోజుల క్రితం స్వగ్రామం జిల్లెల్లకు వచ్చాడు. గురువారం రాత్రి జిల్లెల్ల శివారులోని రాములోని బండ సమీపంలో చెట్టుకు ఉరి వేసుకుని శవమై కనిపించాడు.పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

పోలీస్‌శాఖ గౌరవాన్ని పెంచాలి



ఉత్తమ ప్రతిభ కనబరిచిన కానిస్టేబుల్‌కు ట్రోఫీని అందజేస్తున్న డిజి కమలాసన్‌రెడ్డి



ప్రతిజ్ఞ చేస్తున్న ట్రైనింగ్ పూర్తిచేసుకున్న కానిస్టేబుల్స్

- డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి
- పీటీసీ, సీటీసీల్లో శిక్షణ పూర్తి చేసుకున్న 1,350 కానిస్టేబుళ్లు
- దీక్షాంత్ పరేడ్ హాజరైన పోలీస్ ఉన్నతాధికారులు

కరీంనగర్ క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విజయంతంగా శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టేబుళ్ల నిజాయితీతో ప్రజలకు సేవ చేస్తూ పోలీస్‌శాఖ గౌరవాన్ని పెంచాలని డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి అన్నారు. కరీంనగర్‌లోని పోలీస్ శిక్షణ కళాశాల(పీటీసీ)లో 1,102 ఏఆర్, సివిల్ కానిస్టేబుళ్లు, సిటీ ట్రైనింగ్ సెంటర్(సీటీసీ)లో రాచకొండ కమిషనరేట్‌కు చెందిన 248 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ పూర్తి చేశారు. గురువారం ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ విజయ్ కుమార్, డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ డైరెక్టర్ జనరల్ విబి కమలాసన్‌రెడ్డి, కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి హాజరయ్యారు. సీటీసీలో జరిగిన కార్యక్రమానికి విచ్చేసిన ముఖ్య అతిథికి కరీంనగర్ సీపీ అభిషేక్ మొహంతి, సీటీసీ ప్రిన్సిపాల్ అడిషనల్ డీసీపీ ఏ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఏసీపీ వేణుగోపాల్ పూల మొక్కలతో స్వాగతం పలికారు. పరేడ్ కమాండర్ గౌరవ వందనం అందజేశారు. అనంతరం తెలంగాణ రాష్ట్ర గీతాన్ని ఆలపించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి విబి కమలాసన్‌రెడ్డి మాట్లాడుతూ ట్రైనింగ్‌లో చేరిన 248 మందిని తీర్చి దిద్దిన సీటీసీ అధికారులను ప్రత్యేకంగా అభినందించారు. 9 నెలల బేసిక్ ఇండక్షన్ ట్రైనింగ్ ఎంతో కష్టపడి విజయవంతంగా పూర్తి చేసినందుకు వారందిరినీ అభినందిస్తున్నామన్నారు. శిక్షణలో చాలా వరకు ఉన్నత చదువులు అభ్యసించిన వారే ఉండడం సంతోషం కలిగించిందన్నారు. పోలీస్‌శాఖలో చేరినందుకు వారిని ప్రత్యేకంగా అభినందించారు. పోలీస్ ఉద్యోగం అంటేనే త్యాగానికి ప్రతీక అన్నారు. ఉద్యోగంలో నిత్యం అనేక సవాళ్లు ఎదురవు తాయని, వాటిని ఎదుర్కొని పరిష్కరించేందుకు ఎల్లప్పుడూ సిద్ధంగా ఉండాలన్నారు. పోలీస్ శాఖలో ఎంతో నిజాయితీతో, అంకితభావంతో ప్రజలకు సేవలందిస్తామని ట్రైనీ కానిస్టేబుళ్లచేత సీటీసీ ప్రిన్సిపా ల్, అడిషనల్ డీసీపీ ఎ లక్ష్మీనారాయణ ప్రమాణం చేయించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న కానిస్టే బుళ్ల దీక్షాంత్‌పరేడ్ చేశారు. సీటీసీలో 2019- 20లో మీయావాకి పద్ధతిలో ఏర్పాటు చేసిన చిట్టడవిని సంరక్షిస్తున్నందుకు కరీంనగర్ పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతిని డ్రగ్ కంట్రోల్ డైరెక్టర్ జనరల్ వీబీ కమలాసన్‌రెడ్డి ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో సీటీసీ ప్రిన్సిపాల్ లక్ష్మీనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ ఏసీపీ వేణుగోపాల్‌తో పాటు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కానిస్టేబుళ్ల నుంచి గౌరవ వందనం స్వీకరిస్తున్న డిజి కమలాసన్‌రెడ్డి

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ విజయ్‌కుమార్



మాట్లాడుతున్న విజయ్‌కుమార్

కరీంనగర్ రాంనగర్‌లోని పోలీస్ శిక్షణ కళాశాలలో 1,102 మంది (సివిల్, ఏఆర్) శిక్షణ పొందారు. ఈ కార్యక్రమములో పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్ అధ్వర్యంలో జరగగా, ముఖ్య అతిధిగా రాష్ట్ర అవినీతి నిరోధక శాఖ డైరెక్టర్ జనరల్ విజయ్‌కుమార్ హాజరు అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శిక్షణార్థులు సాంకేతికతను మెరుగు పరుచుకొని చట్టాలపై అవగాహన పెంచుకుంటూ మానసికంగా, శారీరకంగా సన్నద్ధం కావాలి అన్నారు. అలాగే ఉద్యోగంలో క్రమశిక్షణతో పాటు ప్రజల హక్కులను కాపాడుతూ వారి పట్ల మర్యాదగా వ్యవహరించాలన్నారు. శిక్షణ కానిస్టేబుళ్లు చేసే ప్రతి చర్య కూడా డిపార్ట్మెంట్ గౌరవం పెంచేవిగా ఉండాలన్నారు. వృత్తి పరంగా, నడవడిక పరంగా ఇతరులకు ఆదర్శంగా నిలవాలని అన్నారు. చెడు ఎక్కడ ఉన్నా దానిని అణచి వేసే దిశగా అడు గువేయాలని అన్నారు. పోలీస్ శిక్షణ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్ శ్రీనివాస్ మాట్లాడుతూ కానిస్టేబుళ్ల 9 నెలల శిక్షణ పూర్తి అయిందని తెలిపారు. డీజీపీ (ట్రైనింగ్) అభిలాష్ బిస్త్ సూచనల మేరకు శిక్షణ స్థాయిని, కానిస్టేబుల్ స్థాయి నుంచి ఎస్ఐ స్థాయికి పెంచి మారుతున్న అవసరాలకనుగుణంగా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు.

యూనిఫాంపై మక్కువతోనే..

- కానిస్టేబుల్ ఉద్యోగుల్లో ఉన్నత విద్యావంతులే అధికం



కుటుంబ సభ్యులతో అభ్యర్థి

కరీంనగర్ క్రైం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): పోలీసుశాఖలో కానిస్టేబుల్ ఉద్యోగానికి ఇంటర్ అర్హత అయినప్పటికీ పీజీ, ఇంజనీరింగ్, బీఫార్మసీ, డిగ్రీ చదివిన ఉన్నత విద్యావంతులు, కొందరు సాఫ్ట్‌వేర్ ఉద్యోగులు కూడా కానిస్టేబుల్ ఉద్యోగాల కోసం పరీక్ష రాసి ఎంపికయ్యారు. పోలీస్ యూనిఫాంపై ఉన్న మోజు లేదా గౌరవం యువతను పోలీసుశాఖలో ఉద్యోగం చేయాలనే పట్టుదలను, ఇష్టాన్ని పెంచిందని అభ్యర్థులు పేర్కొంటున్నారు. కరీంనగర్‌లోని సిటీ ట్రైనింగ్ సెంటర్(సీటీసీ), పోలీస్ శిక్షణ కళాశాల(పీటీసీ)లో 9 నెలలపాటు కానిస్టేబుల్ శిక్షణ పొందారు. .

● పోలీసుశాఖలో చేరాలనే కోరికతో....

- చింతల సాయికిరణ, యాదాద్రి జిల్లా భువనగిరి



చిన్నప్పటి నుంచి పోలీసు యూనిఫాంపై మక్కువ ఉండేది. మా బావ పోలీసు ఉద్యోగం చేస్తున్నాడు తాను కూడా ఎలాగైనా పోలీసు ఉద్యోగం చేయాలనే సంకల్పంతో పరీక్షరాసి మొదటి ప్రయత్నంలోనే ఉద్యోగం సాధించాను. ఎమ్మెస్సీ పూర్తిచేశాను. మొదటి పోటీ పరీక్షరాయగా కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపికయ్యాను. శిక్షణలో నేర్చుకున్న అంశాలను పరిగణలోకి తీసుకుని నీతి, నిజాయితీగా పనిచేస్తూ ప్రజలకు అన్ని విధాల సేవలు అందిస్తాను.

● కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావటం ఆనందంగా ఉంది

- బోయిని యాదగిరి, యదాద్రి జిల్లా సంస్థాన్ నారాయణపూర్



బీఫార్మసీ పూర్తిచేశాను. ఇదే సమయంలో పోలీసు ఉద్యోగాల నోటిఫికేషన్ పడగా దరఖాస్తు చేసి మొదటి సారి పరీక్షలో ఉద్యోగానికి ఎంపికయ్యాను. సామాన్య ప్రజలకు న్యాయం అందించటం, రక్షణ కల్పించటం, క్రమశిక్షణ కలిగిన కానిస్టేబుల్ ఉద్యోగంలో చేరటం ఆనం దంగా ఉంది, మా తల్లిదండ్రులు కూడా సంతోషంగా ఉన్నారు. ఈ శిక్షణలో పోలీసుల విధులు, సేవలు, చట్టాలు, అమలు అంశాలపై క్షున్నంగా నేర్చుకున్నాం. ముఖ్యంగా ఫిట్‌నెస్ సాధించాం.

● తండ్రి లేని లోటు లేకుండా పెంచాను

- ఉట్ల సాయి సుమన్ తల్లి రమ, యాదాద్రి జిల్లా బ్రాహ్మణపల్లి



వ్యవసాయంలో పంట దిగుబడి రాక అప్పుల బాధతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. కూతురు, కొడుకులను నా తండ్రి సహాయంతో కష్టపడి ఇద్దరు పిల్లలను పెంచాను. తండ్రిలేని లోటు రాకూడదని గ్రామంలో ఆశావర్కర్‌గా పనిచేసుకుంటూ సాయి సుమన్‌ను ఇంజనీరింగ్ చదివించాను. పోలీసుశాఖలో ఉద్యోగం కోసం కొడుకు ఇదివరకు ఒక సారి పరీక్ష రాశాడు. కాని రాకపోవటంతో రెండవసారి పరీక్షరాసి ఉద్యోగానికి ఎంపికయ్యాడు. కానిస్టేబుల్‌గా ఉద్యోగం రావటం సంతోషంగా ఉంది.

గంజాయి సాగుచేస్తున్న వ్యక్తి పై కేసు నమోదు

సారంగాపూర్, నవంబరు, 21(ఆంధ్రజ్యోతి): అక్రమంగా గంజాయి సాగుచేస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి తెలిపారు. ఎస్సై దత్తాద్రి తెలిపిన వివరాల మేరకు రేచపల్లి గ్రామానికి చెందిన పోతుగంటి తిరుపతి అనే వ్యక్తి తన వ్యవసాయ భూమిలో గంజాయి మొక్కలను సాగు చేస్తున్నడన్న సమాచారం మేరకు ఎస్సై తన సిబ్బందితో దాడి చేయగా తన భూమిలో 9 పచ్చని గంజాయి చెట్లు, 300 గ్రాముల ఎండు గంజాయిని స్వాదీనం చేసుకున్నారు. దీని విలువ సుమారు, రూ, 97,500. పంచుల సమక్షంలో పంచనామ చేసి సీజ్ చేశారు. అతడిని అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు ఎస్సై దత్తాద్రి పేర్కొన్నారు.

గంజాయి స్వాధీనం.. ఇద్దరి అరెస్టు

మంథని, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : అక్రమంగా గంజాయి రవాణా చేస్తున్న ఇద్దరు యువకులను అరెస్టు చేసి వారి నుంచి 1.232 కిలోల గంజాయిని స్వాధీనపర్చుకున్నట్లు సీఐ రాజు గురువారం తెలిపారు. సీఐ రాజు కథనం ప్రకారం.. మంథని ఎస్ఐ రమేష్ అందిన నమ్మదగ్గ సమాచారం మేరకు సిబ్బంది రమేష్, వెంకటేశ్వర్లు, అనిల్‌లతో కలిసి మున్సిపల్ పరిధిలోని కుచిరాజ్‌పల్లి గ్రామ శివారులో మధ్యాహ్నం ఇద్దరు వ్యక్తులను పట్టుకొని తనిఖీ చేయగా కవరల్లో గంజాయి లభించిందన్నారు. వీరిని అదుపులోకి తీసుకొని విచారించగా మున్సిపల్ పరిధిలోని కూచిరాజ్‌పల్లి గ్రామానికి చెందిన నక్క ప్రేమస్, మండలంలోని లక్కెపూర్ గ్రామానికి మోహమ్మద్ అర్శత్‌లు ఇచ్చినట్లు తేలిందని, వీరిద్దరికి గంజాయి తాగే అలవాటు ఉందని, కొంత వీరు తాగి మిగితాది చిన్న ప్యాకెట్లుగా తయారుచేసి ఒక్కొక్క ప్యాకెట్ రూ.500 లకు అమ్ముకుంటారని వారు వెల్లడించి నట్లు తెలిపారు. 20 రోజుల క్రితం తాము మహారాష్ట్రలోని సిర్వోంచ మండలంలోని యాటపల్లి గ్రామానికి చెందిన సమీర్ వద్ద రెండు కిలలో గంజాయి కొనుగోలు చేసి తీసుకొచ్చారని వివరించారు. ఇందులో కొంత తమ స్నేహితు లైన రత్న బన్నీ, కళ్యాణ్, వివ, రమేష్‌లకు విక్రయించారిన తెలిపారు. మిగిలింది వారు తాగి, మళ్లీ ఎవరికైనా అమ్ముతామని తమవద్ద ఉంచుకున్నారన్నారు. వీరిని అరెస్టు చేసి కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు తెలిపారు. యువత వ్యసనాల బారిన పడకుండా క్రమశిక్షణతో చదవాలని సూచించారు.

ధర్మపురి ఆలయ అభివృద్ధికి సీఎం కృషి

- రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు

ధర్మపురి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురిలోని లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం అభివృద్ధి కోసం సీఎం కృషి చేస్తానని హామీ ఇచ్చినట్లు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు తెలిపారు. ధర్మపురి పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి గురువారం రాత్రి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. శతాబ్దాల చరిత్ర కలిగి ఉన్న లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయం అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని కోరుతూ రాష్ట్ర దేవాదాయ, ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కలిసి ప్రభుత్వ విప్, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ కోరినట్లు ఆయన తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సానుకూలంగా స్పందించి, ప్రణాళిక సిద్ధం చేసుకోవాలని చెప్పినట్లు ఆయన అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం విద్య, వైద్యానికి పెద్ద పీట వేసినట్లు ఆయన తెలిపారు. రైతులకు ఇచ్చిన మాటకు కట్టుబడి ఉనట సీఎం రేవంత్‌రెడ్డి రైతులకు రూ 2 లక్షలు రుణమాఫీ చేసినట్లు తెలిపారు. గత ఆగస్టు 15 వరకు రైతులకు రూ 18,000 కోట్ల రుణమాఫీ చేసినట్లు ఆయన వివరించారు. దీనికి తోడు రైతులు విక్రయించే సన్న రకం వరి ధాన్యానికి మద్దతు ధర ఇచ్చి, రూ 500 బోనస్ అందిస్తుందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలను పూర్తి స్థాయిలో అమలు చేస్తుందని తెలిపారు. సమావేశంలో టీపీసీసీ సభ్యులు, ధర్మపురి మండల కాంగ్రెస్ అధ్యక్షులు సంగనభట్ల దినేష్, ఏఎంసీ ఛైర్‌పర్సన్ చిలుముల లావణ్య-లక్ష్మణ్, మండల కాంగ్రెస్ ఉపాధ్యక్షులు వేముల రాజేష్, కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు కుంట సుధాకర్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు చీపిరిశెట్టి రాజేష్, నియోజకవర్గ యువజన కాంగ్రెస్ అధ్యక్షులు సింహరాజు ప్రసాద్, సుముఖ్, స్తంభంకాడి గణేష్, షబ్బీర్ పాల్గొన్నారు.

అధునాతన టెక్నాలజీతో జైళ్ల నిర్మాణం

- జైళ్లశాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం సంపత్



మాట్లాడుతున్న జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డిప్యూటీ జనరల్ సంపత్

కరీంనగర్ క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : జిల్లాల్లో అధునాతన టెక్నాలజీతో జైళ్లను నిర్మిస్తున్నామని జైళ్లశాఖ వరంగల్ రేంజ్ డీఐజీ ఎం సంపత్ అన్నారు. కరీంనగర్, ఆదిలాబాద్, నిజామాబాద్ ఉమ్మడి జిల్లాలోని జైలు అధికారులు, సిబ్బందికి రెండు రోజుల పునశ్చరణ తరగతులు గురువారం కరీంనగర్ జైలులో ప్రారంభమయ్యాయి. ఈకార్యక్రమానికి ముఖ్య అతిథిగా జైళ్ల శాఖ వరంగల్ రేంజ్ డీఐజీ సంపత్ హాజరై మాట్లాడుతూ సిద్దిపేట జిల్లాలో అధునాతన టెక్నాలజీతో జిల్లా జైలును నిర్మిస్తున్నామన్నారు. ఇతర జిల్లాల్లో కూడా అధునాతన టెక్నాలజీతో జైళ్ళను నిర్మించి, ఖైదీల రద్దీని తగ్గిస్తామని తెలపారు. మరో అతిథి శాతవాహన యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్ ఉమేష్ కుమార్ మాట్లాడుతూ జైళ్ల శాఖ తీసుకుంటున్న వివిధ సంక్షేమ కార్యక్రమాలు, సంస్కరణలు గురించి కొనియాడారు. కరీంనగర్ జిల్లా జైలు సూపరింటెండెంట్ కె. శ్రీనివాస్ మాట్లాడుతూ రీజినల్ లెవల్ రిట్రీట్‌లో భాగంగా ఖైదీల సంక్షేమం, సిబ్బంది సంక్షేమం, క్రమశిక్షణ, ఆరోగ్యం, సెక్యూరిటీ గురించి చర్చించి భవిష్యత్తులో జైళ్ల శాఖ ప్రతిష్ఠను పెంపొందించే విధంగా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జైలు వైద్య అధికారి డాక్టర్ కె వేణుగోపాల్, సైకియాట్రిస్ట్ ఎల్ వర్షి, అప్పన్న గారి వెంకట్రావు, జైలర్స్ పి శ్రీనివాస్, రమేష్, పర్శరామ్, డిప్యూటీ జైలర్స్ శ్రీనివాస్‌రెడ్డి, ఎస్.సుధాకర్‌రెడ్డి, రమేష్, సంగీత, మినిస్టీరియల్, మెడికల్ సిబ్బంది, ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ నిజామాబాద్ జిల్లాల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ధర్మపురి క్షేత్రంలో భక్తుల రద్దీ



లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుంటున్న భక్తులు

ధర్మపురి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి క్షేత్రంలో గురువారం భక్తుల రద్దీ పెరిగింది. దీంతో స్థానిక లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాలు భక్తులతో కిట కిటలాడాయి. కార్తీక మాసం సందర్భంగా క్షేత్రానికి భారీగా భక్తులు తరలి వచ్చారు. గోదావరి నదిలో కార్తీక స్నానాలు చేశారు. మహిళలు భక్తి శ్రద్ధలతో నదిలో కార్తీక దీపాల వదిలారు. నరసింహుని ఆలయంలో భక్తులు అభిషేకాది పూజలు, కుంకుమార్చన, స్వామి వారల నిత్య కల్యాణం జరిపిం చారు. స్వామి వారలకు ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, వేదపారాయణదారు పాలెపు ప్రవీణ్ కుమార్‌శర్మ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ సూపరిం టెండెంట్ ద్యావళ్ల కిరణ్, సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్ పాల్గొన్నారు.



గోదావరి నది వద్ద హారతి పూజలు చేస్తున్న అర్చకులు

20 వ రోజు ఘనంగా గోదావరి హారతి

కార్తీక మాసం పురస్కరించుకుని ధర్మపురి వద్ద గోదావరి హారతి 20 వ రోజు గురువారం సాయంత్రం ఘనంగా నిర్వహించారు. కార్తీక మాసం నుంచి నిర్వహించే కార్యక్రమంలో భాగంగా ఆలయ వేద పండితులు, అర్చకులు, సిబ్బంది, భక్తులు, మహిళలు మంగళ వాయిద్యాలు వెంటరాగా గోదావరి నది వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం లోక క్షేమార్థం, విశ్వశాంతి కోసం ఆలయ వేదపండితుల మంత్రో చ్ఛరణల మధ్య అర్చకులు నదీ మాతకు హారతి ఇచ్చి కార్యక్రమాన్ని నిర్వహించారు.

రాజన్న ఆలయంలో పూజలు



రాజన్న దర్శనం కోసం క్యూలైన్‌లో వేచివున్న భక్తులు

వేములవాడ కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. కార్తీక మాసంను పురష్కరించుకుని ప్రతి నిత్యం రద్దీ కొనసాగుతోంది. గురువారం రోజున వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి రాజన్నను దర్శించుకున్నారు. కోడెమొక్కు చెల్లించుకుని తరించారు. కార్తీక మాసం సందర్భంగా భక్తులు రాజన్న ఆలయం ముందు కార్తీక దీపాలను వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు.

ఘనంగా కార్తీక దీపోత్సవం

వేములవాడ, కల్చరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వేములవాడ రాజరాజేశ్వర స్వామి వారి ఆలయంలో సామూహిక కార్తీక దీపోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. రాజన్న ఆలయ కళాభవన్‌లో పర్యవేక్షకుడు సంజీవ్ జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్తీక దీపోత్సవం సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో హాజరై ఓం, స్వస్తిక్ ఆకృతుల్లో దీపాలు వెలిగించి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

కోరుట్లలో వేంకటేశ్వర కల్యాణం



స్వామివారి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

కోరుట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): కోరుట్ల పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో స్వామి వారి కల్యాణం గురువారం వేదపండితులు బీర్నంది నర్సింహచారీ మంత్రోచ్ఛారణల మధ్య సాగింది. దేవాలయంలో అర్చన అభిషేకార్యక్రమాలను నిర్వహించిన పురోహితులు స్వామి వారి ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించారు. ప్రత్యేక వేదికపై స్వామి వారి కల్యా ణాన్ని నిర్వహించారు. శ్రీలలితా సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో పూలతో ముగ్గులను వేసి వాటి వద్ద కార్తిక దీపాలను వెలింగించారు. కార్యక్రమంలో దేవాలయ ఈవో విక్రం, దేవాలయ సిబ్బంది పెడిపల్లి నర్సయ్య, శ్రీలలిత సేవా ట్రస్ట్ అధ్యక్షురాలు అడ్డగట్ల లక్ష్మి, సభ్యులు తనుగుల రాజశేఖర్, గుండోజీ మనోహర్, గోడికె రాములులతో పాటు పలువురు పాల్గొన్నారు.

75శాతం హాజరు తప్పనిసరి

గణేశ్‌నగర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలోని అన్ని ప్రభుత్వ ప్రైవేట్ అనుబంధ కళాశాలల్లో చదువుతున్న డిగ్రీ, పీజీ విద్యార్థులకు 75శాతం హాజరు తప్పనిసరి అని వీసీ ఉమేష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. తక్కువ హాజరు నమోదైతే వారిని పరీక్షలకు అనుమతించబోమని ఆయన పేర్కొన్నారు.

పారిశుధ్య కార్మికుల ప్రాణాలు గాలికి..

- సంవత్సరాలుగా అందని బూట్లు
- ఊసేలేని సబ్బులు, నూనె
- మూడేళ్లుగా అందని ఆర్జిత సెలవు సొమ్ము



జగిత్యాల మున్సిపల్ కార్మికులు

జగిత్యాల అర్బన్, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) కరోనా వచ్చినా.. కలరా వచ్చినా.. వాన అయినా.. వరదైనా అలుపెరుగకుండా పనిచేసేది పారిశుధ్య కార్మికులు. వారు పనిచేయకుంటే పరిస్థితి ఎంత దారుణంగా ఎంటుందో చెప్పాల్సిన అవసరం లేదు. అలాంటి పారిశుధ్య కార్మికులకు వారి రక్షణ కోసం కల్పించాలని సౌకర్యాలు కల్పించడం లేదు. జగిత్యాల మున్సిపాటీలో మొత్తం 305 మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఇందులో 265 మంది కాంట్రాక్టు కార్మికులు కాగా మిగతా 40 మంది పర్మనెంట్ కార్మికులు పనిచేస్తున్నారు. వీరందరి రక్షణ కోసం ప్లాస్టిక్ బూట్లు సంవత్సరానికి ఓసారి ఇవాల్సి ఉంది. ప్రస్తుత మునిపల్ కౌన్సిల్ అధికారంలోకి వచ్చిన కొత్తలో ఓసారి బూట్లు ఇచ్చిన అధికారులు మళ్లీ ఇప్పటి వరకు ఒక్క సారి కూడా బూట్లు ఇవ్వలేదని కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం మురికాలువల్లో చెత్తను తొలగించే మున్సిపల్ పారిశుధ్య కార్మికులు అనేక సార్లు మురికి కాలువల్లోకి దిగాల్సి ఉంటుంది. అలా దిగే క్రమంలో కార్మికుల కాళ్లకు గాజు పెంచుల లాంటివి గుచ్చుకుండా బూట్ల అవసరం ఉంటుంది. నిత్యం మురికితో సావాసం చేసే కార్మికులకు పనిచేసే సమయంలో ఒంటికి పట్టిన మురికిని వదలించుకునేందుకు ప్రతి నెలా ఒకటి చొప్పున సంవత్సరానికి పన్నెండు బట్టల, పన్నెండు స్నానానికి సబ్బులు ఇవ్వాల్సి ఉంది అయితే అయిదేళ్లగా ఇప్పటి వరకు ఒకటి రెండు సార్లు మాత్రమే సబ్బులు ఇచ్చారని కార్మికులు అంటున్నారు. దీంతో పారిశుధ్య కార్మికులపై పాలక వర్గానికున్న నిర్లక్ష్యాన్ని ప్రతిబింబిస్తున్నది. అలాగే కార్మికులకు ఏటా ఐదు కిలోల కొబ్బరి నూనె ఇవ్వాల్సి ఉండగా ఈ అయిదు సంవత్సరాల కాలంలో ఒక్కసారి మాత్రమే అధికారులు కొబ్బరి నూనె ఇచ్చినట్టు కార్మికులు చెబుతున్నారు.

పర్మనెంట్ కార్మికులకు ఇవ్వాల్సిన ఆర్జిత సెలవులు మూడు సంవత్సరాలుగా మంజూరు చేయక పోవడంతో కార్మికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల రక్షణ కోసం మురికి కాలువల్లో దిగి తమ ఆరోగ్యాన్ని లెక్క చేయకుండా పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులను పట్టించుకోకపోవడం విమర్శలకు తావిస్తున్నది.

పూర్తి వివరాలు తెలుసుకుని సమస్య పరిష్కరిస్తాం

- చిరంజీవి మున్సిపల్ కమిషనర్, జగిత్యాల

పారిశుధ్య కార్మికులకు ఏటా ఒక సారి ఇవ్వాల్సిన సబ్బులు, నూనె, కాళ్లకు బూట్లు రెండు, మూడు సంవత్సరాలుగా ఇవ్వని విషయం ఇప్పుడే నా దృష్టికి వచ్చింది. దానికి సంబంధించిన పూర్తి వివరాలు తెలుసుకొని కౌన్సిల్ ఆమోదంతో త్వరలో సమస్య పరిష్కరిస్తా. అలాగే ఆర్జిత సెలవుల విషయం కార్మికులు దరఖాస్తు చేసుకుంటే పరిశీలిస్తాం.

కొనుగోళ్లు వేగవంతం చేయాలి

అదనపు కలెక్టర్ లత

సారంగాపూర్, నవంబరు, 21 (ఆంధ్రజ్యోతి) మండలంలో ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం జిల్లా అదనపు కలెక్టరు బీఎస్ లత పరిశీలించారు. కొనుగోళ్లు మరింత వేగవంతం చేయాలని అధికారులకు ఆదేశాలు ఇచ్చారు. సెంటర్‌లో ఉన్న రికార్డులను తనిఖీ చేశారు. తహసీల్దార్ జమీర్, ఇన్‌చార్జి ఏడీఏ తిరుపతి నాయక్, డీటీ లాస్య, ఆర్ఐ బాస్కర్‌రావు, అధికారులు పాల్గొన్నారు.

పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు

రాయికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రామాజీపేట గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠాపనోత్సవాలు ఘనంగా జరిగాయి. గురువారం ఎమ్మెల్సీ టి. జీవన్‌రెడ్డి పెద్దమ్మ తల్లిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన మాజీ వార్డు మెంబర్ ఓరగంటి రాజక్క తండ్రి మరణించగా ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమాల్లో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు గోపి రాజరెడ్డి, నారాయణ, పాల్గొన్నారు.

విప్ పరామర్శ

ఎండపల్లి, నవంబర్ 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని అంబారిపేట గ్రామానికి చెందిన అరెల్లి విఘ్నేష్ రోడ్డు ప్రమాదంలో గాయపడి మృతి చెందగా వారి కుటుంబాన్ని గురువారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. మండల అధ్యక్షులు శైలెందర్‌రెడ్డి పాల్గొన్నారు.

జావెలిన్ త్రోలో విద్యార్థికి కాంస్య పతకం

ధర్మపురి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ధర్మపురి పట్టణంలోని ఆంగ్లోవేదిక్ కాన్వెంట్ హైస్కూల్‌కు చెందని 5వ తరగతి విద్యార్థి ఎండీ రశిదాన్ జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో ప్రతిభ కనబరచి కాంస్య పతకాన్ని సాధించారు. మెట్‌పల్లి పట్టణంలోని మినీ స్టేడియంలో ఇటీవల జిల్లా అథ్లెటిక్స్ ఆధ్వ ర్యంలో జిల్లా స్థాయి అథ్లెటిక్స్ టోర్నమెంట్ అండ్ సెలక్షన్ సబ్ జూనియర్ విభాగంలో జావెలిన్ పోటీలు నిర్వహించారు. పోటీల్లో రశిదాన్ కాంస్య పతకాన్ని గెలుచుకున్నారు. విద్యార్థి రశిదాన్‌ను స్కూల్ కరస్పాండెంట్ సంగనభట్ల దినేష్ అభినందించారు.

తప్పుడు వైద్యం చేస్తే చర్యలు తప్పవు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్



సమావేశానికి హాజరైన ఆర్ఎంపీ, పీఎంపీలు

జగిత్యాల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో ఆర్ఎంపీ, పీఎంపీలు తప్పుడు వైద్యం చేస్తే చర్యలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి ప్రమోద్ కుమార్ అన్నారు. గురువారం పట్టణంలోని సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలోని వైద్య ఆరోగ్య శాఖ విభాగంలో ఆర్ఎంపీ, పీఎంపీలతో జగిత్యాల జిల్లా స్థాయి అవగాహన సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడారు. తప్పుడు వైద్యం, అబార్షన్లు, ప్రసవాలు, కొన్ని రకాల సర్జరీలు చేస్తూ కొందరు ఆర్ఎంపీలు ప్రజల ప్రాణాలతో చలగాట మాడుతున్నారని మండిపడ్డారు. విచ్చలవిడిగా యాంటి బయోటిక్స్ మందులను రోగులకు ఇస్తున్నారని, అటువంటి వారిని ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తెలంగాణ క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ 2010 ప్రకారం ప్రథమ చికిత్స చేసే ఆర్ఎంపీలు తమ పేర్ల ముందు డాక్టర్ అని పెట్టుకోకూడదని ఆదేశించారు. ఆర్ఎంపీలు స్థాయికి మించి వైద్యం చేస్తున్నట్లు అనేక ఆరోపణలు న్నాయన్నారు. చికిత్స కేంద్రం ముందు సూచిక బోర్డుల పై ఫస్ట్ ఎయిడ్ సెంటర్, ప్రథమ చికిత్స కేంద్రం అని మాత్రమే ప్రదర్శించాలని సూచించారు. క్లినిక్, ఆసుపత్రి, నర్సింగ్ హోం, మెడికల్ సెంటర్ తదితర పేర్లతో సూచిక బోర్డులు ప్రదర్శించరాదన్నారు. ఆర్ఎంపీలు స్వయంగా రోగ నిర్ధారణ చేసి మందులు ఇవ్వడం, ఇంజక్షన్లు చేయడం వంటివి చేయరాదన్నారు. రోగులకు వైద్య మందుల చీటీని రాయకూడదని, రోగులకు సెలైన్ బాటిల్స్ ఎక్కించారదని తెలిపారు. ఇన్ పేషంట్ వైద్యం చేయకూడదని, ల్యాబ్‌లు నిర్వహించరాదని, అబార్షన్లు, కాన్పులు వంటి హై రిస్క్ చికిత్సలు చేయవద్దని హెచ్చరించారు. జిల్లాలో చాలా మంది నకిలీ డాక్టర్లు మానసిక ఔషధాల ప్రిస్కిప్షన్ల లోనూ ఇష్టారాజ్యంగా మందులు రాస్తున్నార ని ఆరోపణలున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ శ్రీనివాస్, డాక్టర్ పి అర్చన, డాక్టర్ జైపాల్ రెడ్డి, హెల్త్ ఎ డ్యుకేటర్ భూమేశ్వర్, కార్యాలయ సిబ్బంది రాజేశం, జిల్లాలోని పలు ప్రాంతాలకు చెం దిన ఆర్ఎంపీలు, పీఎంపీలు పాల్గొన్నారు.

తూకం వేసిన రైతుల వివరాలను ఎంట్రీ చేయాలి

డీసీవో మనోజ్‌కుమార్

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 21 (ఆంధ్రజ్యోతి) : కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేసిన రైతుల వివరాలు జాప్యం చేయకుండా ఎప్పటికప్పుడు ట్యాబ్ లో ఎంట్రీ చేయాలని డీసీవో మనోజ్‌కుమార్ అధికారులకు ఆదేశించారు. గురువారం మెట్‌పల్లి విశాల సహకారం సంఘం కార్యాలయంను సందర్శించి రికార్డులు పరిశీలించి, కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యం, కొనుగోలు చేసిన ధాన్యం, ట్యాబ్ ఎంట్రీ, లారీలు, హమాలీ తదితర వివరాలన్నింటినీ సీఈవో ప్రవీణ్ అడిగి తెలుసుకున్నారు. ట్యాబ్‌లో రైతుల వివరాలు త క్కువగా ఉండడంతో అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొనుగోలు చేసిన ధాన్యాన్ని వెంటనే మిల్లులకు తరలించి నిర్లక్ష్యం చేయకుండా రైతుల వివరాలను ఎప్పటికప్పుడు ట్యాబ్‌లో వంద శాతం నమోదు చేయాలని సూచించారు. వివరాలు వెంటనే నమోదు చేస్తే వారి ఖాతాల్లో సరైన సమయంలో డబ్బులు జమవుతాయన్నారు. కేంద్రాల్లో 17 శాతం తేమతో వచ్చిన ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేసి మిల్లులకు పంపించాలని, కొనుగోళ్లల్లో ఎలాంటి నిర్లక్ష్యం చేసిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో అధికారులు నిజామొద్దీన్, ఖలీం, సీఈవో ప్రవీణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఓపీఎంఎస్ డేటా వేగవంతం చేయాలి

రాయికల్: రైతులకు 48 గంటల్లోగా డబ్బులు వారి ఖాతాలో జమ అయ్యేలా ఓపీఎంఎస్ డేటాను వేగవంతం చేయాలని జిల్లా సహకార అధికారి మనోజ్ కుమార్ అన్నారు. అల్లీపూర్ సహకార సంఘం పరిధి లోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాలను గురువారం ఆయన సందర్శించారు. వరిధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని కొనుగోలు కేంద్ర నిర్వాహకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ ఖయ్యూం, సంఘం అధ్యక్షుడు రాజలింగం, సీనియర్ ఇన్‌స్పెక్టర్ స్వప్న, ఏఈవో సుమలత, కార్యదర్శి ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ కేంద్రం నిర్వాహకుడిపై చర్యలు తీసుకోవాలని దీక్ష

కథలాపూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) మండలంలోని సిరికొండలో కొనసాగుతున్న ఆధార్ కేంద్రం నిర్వాహకుడు తన సొంత ఇంటిలో నిర్వహిస్తూ ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నాడని ఆయనపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట మాజీ ఎంపీపీ నాంపల్లి లింబాద్రి నిరసన దీక్ష చేపట్టారు. వాస్తవానికి గ్రామపంచాయతీలో నడపాల్సి ఉండగా పదేళ్ల నుంచి ఇంట్లోనే నడుపుతూ నిబంధనలకు అతిక్రమించినందు వల్ల ఆధార్ కేంద్రం నిర్వాహణ బాధ్యతలు మరొకరికి అప్పగించాలని పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్‌కు ఈ విషయమై ఫిర్యాదు చేస్తే హడావుడిగా గ్రామపంచాయతీకి తరలించడానికి సహకరించిన పంచాయతీ కార్యదర్శిని సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. చర్యలు తీసుకునే దాకా నిరసన కార్యక్రమం కొనసాగిస్తానని లింబాద్రి పేర్కొన్నారు. ఈ దీక్షకు మాజీ జడ్‌పీటీసీ నాగం భూమయ్య, మాజీ కోఆప్షన్ సభ్యుడు రఫీ, సింగిల్ విండో డైరెక్టర్ గుండారపు గంగాధర్, మాజీ ఎంపీటీసీ మనోహర్ సంఘీభావం తెలిపారు.

భూ సర్వేకు తప్పని నిరీక్షణ...

(5వ పేజీ తరువాయి)

అసలే సర్వే అధికారుల కొరత ఉందంటే పనిభారం అధికంగా ఉంటోంది. రైతులు దరఖాస్తులతో పాటు ప్రభుత్వం చేపట్టిన వివిధ ప్రాజెక్టులు, రహదారుల భూ సేక రణకు భూములను కొలతలు వేసే బాధ్యత వీరిపైనే ఉంది. గతంలో పోడు భూముల సమస్య పరిష్కారానికి చేపట్టిన కార్యక్రమాల్లో రెవెన్యూ, అటవీ భూముల సరి హద్దులతో పాటు రైతులకు కొలతలు వేసి సరిహద్దులు నిర్ణయించాల్సింది కూడా సర్వేయర్లు జరిపారు. ఇటీవల జిల్లాలోని పలు మండలాల గుండా వెళ్తున్న జాతీయ రహ దారి 63ను నాలుగు వరసల రహదారిగా విస్తరణ చేయడానికి అవసరమైన భూసేకరణ పనులను సర్వేయర్లు నిర్వహించారు. జగిత్యాల నుంచి కరీంనగర్ వరకు రహదారి విస్తరణకు అవసరమైన భూసేకరణ సర్వే పనులను నిర్వర్తించారు. వీటితో పాటు రైతుల సరిహద్దు సమస్యలను సైతం పరిష్కరించాల్సి ఉంటుంది. దీంతో సర్వేయర్లు, సిబ్బందిపై పనిభారం పెరుగుతోంది.

● అప్పట్లో వివాదాలు...నిధులు తక్కువే..

సుమారు నాలుగు, అయిదు దశాబ్దాల క్రితం వరకు భూ వివాదాల సంఖ్య అంతంతమాత్రంగానే ఉండేది. దీంతో భూముల సర్వేలో పెద్దగా తలనొప్పులుండే వికావు. కాలక్రమేణా భూముల విలువలు అమాంతం పెరిగిపోవడంతో సర్వేయర్లపై కూడా పనిబారం పడుతోంది. గజం జాగకు కూడా పోటీపడడం..భూ ఆక్రమణలు, ఇరుగు పొరుగు మధ్య వివాదాలు, సరిహద్దు తగాదాలు, సర్వే నంబర్ ఒక చోట భూమి మరోచోట ఉండడం, భూముల పంపకంలో తేడాలతో ఒక్కసారిగా భూముల సర్వేకు డిమాండ్ పెరిగింది. ఈ నేపథ్యంలో భూ రికార్డుల సర్వే విభాగాన్ని ఆశ్రయించే వారి సంఖ్య కూడా పెరుగుతూ వస్తోంది.

● సమస్యలను సకాలంలో పరిష్కరిస్తాం..

వెంకట్ రెడ్డి, ఏడీ, జిల్లా భూ కొలతల శాఖ

జిల్లాలో మీ సేవా ద్వారా వచ్చిన దరఖాస్తులను ఎప్పటిక ప్పుడు పరిష్కరించడానికి ప్రయత్నిస్తున్నాము. ఎక్కువగా పెండింగ్‌లో ఉంచడం లేదు. ఆలస్యానికి సిబ్బంది కొరత కూడా ఎదురవుతుంది. కొలతలు వేసేందుకు క్షేత్ర స్థాయిలో వెళ్లేసరికి పలు వివాదాలు జరుగుతుండడం కొలతలు వేయకుండా వెను దిరగాల్సి వస్తోంది. ప్రభుత్వం చేపట్టే రహదారుల విస్తరణ, అభివృద్ధి, ప్రాజెక్టుల నిర్మాణం తదితర పనులకు సర్వేయర్లు సేవలందిస్తుండడంతో రైతుల దరఖాస్తుల పరిష్కారంలో కొంత జాప్యం ఏర్పడుతోంది.

అక్రమ నిర్మాణాలను అరికట్టాలి

మున్సిపల్ కమిషనర్‌కు వినతి

కోరుట్ల, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని నేషనల్ హైవే- 63 అనుకోని ఉన్న రోడ్డును ఆక్రమించి అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని వాటిని అరి కట్టాలని డిమాండ్ చేస్తూ బీజేపీ వార్డు కౌన్సిలర్ పెండం గణేష్ శుక్రవారం మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా కౌన్సిలర్ గణేష్ మాట్లాడారు. పట్టణం శివారులోని 1362, 1363 సర్వే నంబర్‌లో జాతీయ రహదారిని ఆనుకుని కేవలం 45 అడుగుల రోడ్డు మీదనే అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని ఆరోపించారు. నేషనల్ హైవే మీద 100 ఫీట్ల వదిలి నిర్మాణం చేయవలసి ఉండగా నింబంధనలకు విరుద్ధంగా కొందరు రియల్టర్లు స్వలాభం కోసం మున్సిపల్ నిబందనలు తుంగలో తొక్కి అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారని అన్నారు. అధికారులు పట్టించుకోకుంటే మరికొంత మంది కూడా అక్రమ నిర్మాణాలకు తెర లేపుతారని అధికారులు స్పందించాలని అన్నారు.

మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోని అక్రమ కట్టడాలను అడ్డుకోవాలని ఈ సందర్భంగా అధికారులను కోరారు.

పరిసరాల పరిశుభ్రతను పాటించాలి

రాయికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలని ప్రభుత్వ వైద్యుడు ఉదయ్ కిరణ్ అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థులకు పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కాలకృత్యాల తర్వాత, భోజనానికి ముందు చేతులు, కాళ్లను సబ్బుతో శుభ్రం చేసుకోవాలని సూచించారు. వ్యాధిగ్రస్థులు అయినప్పుడు యాంటీ బయోటిక్స్‌ను డాక్టర్ సలహా ప్రకారం వాడాలని సూచించారు.

సొంత వైద్యం చేసుకోకూడదని సూచించారు. సూక్ష్మ జీవులు టాక్సిన్‌ల బారిన పడకుండా రోగ నిరోధక శక్తిని పెంచుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులకు పరిసరాల పరిశుభ్రతపై క్విజ్ పోటీలు నిర్వహించి, బహుమతులు అందజేశారు.

ఈ కార్యక్రమంలో ల్యాబ్ టెక్నీషి యన్ మోసారపు సంతోష్, కంప్యూటర్ ఆపరేటర్ పవన్, ఉపాధ్యాయులు పొన్నం రమేష్, రవీందర్, మల్లేశం, గం గజమున, సత్యనా రాయణ, నాగరాజు, తిరుమల, గంగా ధర్, వనిత, శివానందం, పారిపెల్లి గంగాధర్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఈపాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలి

జిల్లా వ్యవసాయాధికారి రాంచందర్

మల్లాపూర్, నవంబరు, 21 (ఆంధ్రజ్యోతి) : ఫర్టిలేజర్ దుకాణదారులు ఈపాస్ ద్వారానే ఎరువులు విక్రయించాలని జిల్లా వ్యవసాధికారి రాంచందర్ ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎరువుల ఫర్టిలేజర్ షాపులను ఏవో లావణ్యతో కలిసి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దుకాణాల్లోని స్టాక్ వివరాలను రికార్డుల్లో నమోదు చేయాలన్నారు. ఎరువులను ఈపాస్ ద్వారానే రైతులకు విక్రయించాలని, నకిలీ విత్తనాలు విక్రహిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులు కొనుగోలు చేసిన ప్రతి దానికి రసీదులు అందజేయాలని సూచించారు. అనంతరం రాఘవుపేటలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించారు. ధాన్యం కొనుగోలు చేసిన వివరాలు అడిగి తెలుసుకుని, ధాన్యం తేమ శాతం పరిశీలించారు. మ్యాచర్ వచ్చిన ధాన్యాన్ని త్వరగా తూకం వేసి మిల్లులకు తరలించాలని నిర్వహకులకు సూచించారు. కొనుగోలు చేసిన ధాన్యానికి సంబంధించిన తక్‌పట్టిలను రైతులకు అందజేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈవోలు, షాపు యజమానులు, రైతులు పాల్గొన్నారు.



రాఘవుపేటలో ధాన్యం తేమ శాతం పరిశీలిస్తున్న వ్యవసాయాధికారి

రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి

విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలని ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అధికారులను ఆదేశించారు. వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామ శివారులో ఇటీవల పలు రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ముత్తునూర్ గ్రామ శివారు లోని లిఫ్టఉన్న ప్రదేశాన్ని అధికారులు, నాయకులతో కలిసి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానికంగా ఉన్న నాయకుల ద్వారా రోడ్డు ప్రమాదాలు జరగడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం సంబంధిత అధికారులతో మాట్లాడి ప్రమాదాలు జరగకుండా తగు చర్యలు తీసుకోవాలని, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని ఎస్సై ఉమాసాగర్‌కు సూచించారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేంధర్ రెడ్డి, సందీప్‌రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

● వెల్గటూర్ మండలం ముత్తునూర్ గ్రామానికి చెందిన లక్ష్మణ స్వామి తల్లి జక్కాపురం సత్తవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందగా గురువారం ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు శైలేంధర్ రెడ్డి, మంజుల, తిరుపతి పాల్గొన్నారు.

హెల్త్ సబ్‌సెంటర్ భవన నిర్మాణానికి భూమి పూజ

మెట్‌పల్లి రూరల్, నవంబర్, 21 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వేంపేట గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్ నూతన భవన నిర్మాణానికి గురువారం మండల వైద్యాధికారి డాక్టర్ అంజిత్‌రెడ్డి, నాయకులతో కలిసి భూమి పూజ చేశారు. ప్రజాల అవసరం కోసం స్వంత భూమిని సబ్‌సెంటర్‌కు ఇచ్చిన మాజీ ఎంపీటీసీ వెంకటేష్‌ను మండల వైద్యాధికారితో పాటు నాయకులు కృతజ్ఞతలు తెలిపి అభినందించారు. నాయకులు పుల్ల చంద్రశేఖర్‌గౌడ్, పల్లి శేఖర్‌గౌడ్, గంగారెడ్డి, రిటైర్డ్ పీఆర్ డీఈ అన్వర్, పంచాయతీ కార్యదర్శి అశోక్, పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు పరామర్శ

రాయికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలువురు బాధిత కుటుంబాలకు జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ కుమార్ గురువారం పరామర్శించారు. రాయికల్ పట్టణానికి చెందిన శంషేర్ తల్లి నజీరాబీ అనారోగ్యంతో మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. మండలంలోని చింతలూరు గ్రామానికి చెందిన ముద్దం శ్రీనివాస్ కొడుకు ముద్దం శ్రీకర్ గూడూరు రైల్వే స్టేషన్‌లో కింద పడి మరణించగా వారి కుటుంబసభ్యులను పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట పీఏసీఎస్ చైర్మన్ ఏనుగు మల్లారెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ గన్నె రాజరెడ్డి, నాయకులు అచ్యుత రావు, పడిగెల రవీందర్ రెడ్డి, కో ఆప్షన్ సభ్యుడు మహేందర్ బాబు ఉన్నారు.

● మండలంలోని పలు మృతుల కుటుంబాలను బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు, జగిత్యాల నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ బోగ శ్రావణి గురువారం పరామర్శించారు. మండలంలోని చెర్లకొం డాపూర్ గ్రామానికి చెందిన బెల్లాల కీర్తి కృష్ణ, ఒడ్డెలింగాపూర్ గ్రామానికి చెంది పాలకుర్తి అశోక్, మంక్యా నాయక్ తండాకు చెందిన శాలవ్వ, ధర్మాజీపేట గ్రామానికి చెందిన అంజలిలు ఇటీవల మరణించడంతో వారి కుటుంబాలను పరామర్శించారు. ఆమె వెంట రాయికల్ మండల అధ్యక్షుడు అన్నవేణి వేణు, మాజీ ఎంపీటీసీ మహేష్, పాల్గొన్నారు.

అథ్లెటిక్స్ పోటీల్లో గర్ల్స్ స్కూల్ విద్యార్థుల ప్రతిభ

జగిత్యాల అగ్రికల్చర్,నవంబరు 21(ఆంధ్రజ్యోతి)ఐ మెట్‌పల్లిలో నిర్వహించిన అథ్లెటిక్ పోటీల్లో జగిత్యాల పట్టణంలోని స్థానిక ప్రభుత్వ బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ కనబర్చినట్లు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామనుజం తెలిపారు. పాఠశాలలో ఏడవ తరగతి చదువుతున్న మోక్షిత్ 100 మీటర్ల పరుగుపందెంలో 16.01 సెకండ్లలో పూర్తి చేసి మూడో స్థానంలో నిలిచాడన్నారు. మొత్తం పాఠశాల నుంచి పది మంది విద్యార్థులు వివిధ విభాగాల్లో పాల్గొని ప్రతిభ కనబర్చినట్లు తెలిపారు. విద్యార్థులను ఉపాధ్యాయ సంఘ నాయకుడు భోనగిరి దేవయ్య, ఉపాధ్యాయులు జయశ్రీ, రజాక్, రజిత, శ్రీలత, శ్రీనివాస్‌రెడ్డి, కమలాకర్‌రెడ్డి, కరుణాకర్ అభినందించారు.

వ్యవసాయ మార్కెట్‌లో జీరో దందా..

● పట్టించుకోని అధికారులు..
● ప్రభుత్వ ఆదాయానికి గండి

మెట్‌పల్లి రూరల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి) : ఆరుగాలం కష్టపడి పండించిన పంటలకు విక్రయించడానికి రైతులకు గిట్టుబాటు ధర కల్పించడంలో అధికారులు విఫలమవుతున్నారు. అక్రమ వ్యాపారుల పట్ల అధికారులు నిర్లక్ష్యం వహించడంతో మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలో జీరో దందా నడుస్తోంది. పంటలను తక్కువ ధరకు కాజేసేందుకు వ్యాపారులు, దళారులు ఎత్తుగడలు వేస్తున్నారు. అధికారులు అక్రమ వ్యాపారులకు అండగా ఉండడంతో ప్రతి కొనుగోళ్ల సమయంలో వ్యవసాయ మార్కెట్ ఆదాయానికి భారీగా గండి పడుతోందనే విమర్శలు వస్తున్నాయి. వ్యాపారులు యథేచ్ఛగా దుకాణాలు ఏర్పాటు చేసుకుని దళారులతో రైతుల ఇండ్ల వద్దనే ధాన్యం కొనుగోళ్లు సాగిస్తున్నారు. గ్రామాల్లో ధాన్యం కొంటే నిబంధల ప్రకారం ఒక శాతం కమిషన్ మార్కెట్‌కు చెల్లించాల్సి ఉంటుంది. మార్కెట్ పరిధిలో వ్యాపారస్థులు కోట్లలో ధాన్యం కొనుగోళ్లతో పాటు ఇతర పంటలను కొనుగోళ్లు చేస్తున్నారు.

కానీ పెద్ద మొత్తంలో ధాన్యం కొని కొంత ధాన్యానికి మాత్రమే మార్కెట్‌కు ఫీజు చెల్లిస్తున్నారని ఆరోపణలు వెల్లువెత్తున్నాయి. దీంతో మార్కెట్ యార్డుకు రావాల్సిన ఆదాయం రావడం లేదు.

● ప్రభుత్వ ఆదాయానికి గండి

మార్కెట్ పరిధిలో పంటల కొనుగోళ్లల్లో చేసిన వాటి లావాదేవీల ప్రకారం ఆదాయం ఎంత వచ్చిందని తెలుస్తుంది. కానీ మార్కెట్ యార్డు నుంచి లైసెన్స్ తీసుకోవడానికి, నిర్ణీత ఫీజు చెల్లించడానికి వ్యాపారులు పెద్దగా ఆసక్తి చూపడం లేదు. లైసెన్స్ తీసుకున్న వ్యాపారస్థులు స్వంతగా రైతుల వద్దకు వెళ్లి కొనుగోలు చేసి వాటిని ఇతర ప్రాంతాలకు తరలించి వ్యాపారం చేస్తున్నారు. మార్కెట్ యార్డు పరిధిలో ప్రస్తుతం రైతుల నుంచి మొక్కజొన్న, వరి ధాన్యం వ్యాపారులు కొనుగోలు చేస్తు న్నారు. వరి క్వింటాలకు మద్దతు ధర 2320 కల్పించింది. కానీ వ్యాపారస్థులు క్వింటాలుకు రూ. 1800 నుంచి 2000 వరకు మాత్రమే చెల్లిస్తున్నారు. వ్యాపారస్థులు యార్డు బయట కొనుగోలు చేస్తూ మార్కెట్ ఫీజులు చెల్లించకున్నా పట్టించుకోవడం లేదనే ఆరోపణలున్నాయి.

● మోసపోతున్న రైతులు...

రైతులు తమ ధాన్యాన్ని విక్రయించడానికి ప్రభుత్వం మంచి మద్దతు ధరను పొందేందుకు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. మార్కెట్ పరిధిలోని దిగుబడులను కొనుగోలు చేసిన వాటి చెల్లింపులు, సక్రమంగా లేకపోయిన తూకాల్లో మోసం జరిగినా రైతులు అధికారులను నిలదీసే వీలు ఉంటుంది. వీటన్నింటిపై రైతు లకు అవగాహన కల్పించాల్సిన అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. ఇప్పటికైనా అధికారుల పర్యటిస్తూ అక్రమ కొనుగోళ్లపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.




వ్యవసాయ మార్కెట్ కార్యాలయం

● చర్యలు తీసుకుంటాం

ఇంద్రసేనరెడ్డి, కార్యదర్శి, మెట్‌పల్లి మార్కెట్ యార్డు కమిటీ

మెట్‌పల్లి వ్యవసాయ మార్కెట్ యార్డు పరిధిలోని వ్యాపారులు ఫీజులు చెల్లించేలా పకడ్బందీగా చర్యలు తీసుకుంటాము. మార్కెట్ ఆదాయానికి గండి కొట్టే వ్యాపారులను గుర్తించి లైసెన్సులు రద్దు చేస్తాం. వేరే జిల్లాల వారు వచ్చి కొనుగోలు చేస్తున్నారని, సిబ్బంది కొరత ఉండడం వలన పూర్తి స్థాయిలో అరికట్టలేక పో తున్నాం. గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లపై దృష్టి సారించాం.

పార్టీ బలోపేతానికి సైనికుల్లా పని చేయాలి



కార్యకర్తలతో నినాదాలు చేస్తున్న వసంత

బీర్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): పార్టీ బలోపేతానికి ప్రతి బీఆర్ఎస్ కార్యకర్త ఓ సైనికుడిలా పనిచేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్మన్ దావ వసంత అన్నారు. గురువారం బీర్‌పూర్ గ్రామంలో నూతనంగా ఎన్నికైన బీఆర్ఎస్ గ్రామశాఖ కార్యవర్గాన్ని శాలువాలు కప్పి అభినందించారు. ఈ సందర్భంగా గ్రామంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి పూలమాలలు వేశారు. అనంతరం వసంత మాట్లాడుతూ పార్టీ బలోపేతం కోసం బీఆర్ఎస్ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షులు నేరెల్ల సుమన్, మాజీ జడ్పీటీసీ కొల్ముల రమణ, నాయకులు కిషన్, సుదర్శన్, వెంకటేష్, రవీందర్, మల్లా రెడ్డి పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు ఎంపిక

రాయికల్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెట్‌పల్లి మినీ స్టేడియంలో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ అండర్ 8, 10, 12 విభాగాల్లో విస్డమ్ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. 50 మీటర్ల పరుగు పందెం, స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో బొమ్మెన లోకేశ్వర్ స్వర్ణం, రజతం, గడ్డం తన్మయ 50 మీటర్లు, 300 మీటర్ల పరుగు పందెంలో కాంస్యం, చౌడారపు దేవాన్షి స్టాండింగ్ బ్రాడ్ జంప్‌లో కాంస్యం, పెద్దిరెడ్డి హర్షిత్ రెడ్డి 50 మీటర్ల పరుగులో కాంస్యం పతకాలు సాధించి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. రాష్ట్ర స్థాయికి ఎంపికైన విద్యార్థులు జగిత్యాల జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ కార్యదర్శి ఏలేటి ముత్తయ్య రెడ్డి, విజ్డమ్ హైస్కూల్ ప్రిన్సిపాల్ ఎద్దండి ముత్యంపు రాజు రెడ్డి, ప్రెస్ క్లబ్ జేఏసీ ప్రధాన కార్యదర్శి కడకుంట్ల జగదీశ్వర్‌లు అభినందించి మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు.

ఘనంగా స్వయంపాలన దినోత్సవం

బుగ్గారం నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెలుగొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం స్వయం పాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. బాల, బాలికలు ఉపాధ్యాయులుగా వ్యవహరించి అలరించారు. తరగతి గదిలో బోధించిన తీరు ఆకట్టుకుంది. ముగ్గురు విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. అనంతరం ప్రధానోపాధ్యాయులు చంద్రశేఖర్ రెడ్డి మాట్లాడుతూ స్వయం పాలన దినోత్సవం విద్యార్థులలో క్రమశిక్షణ, అంకిత భావం అలవడుతుందని పేర్కొన్నారు. సభా వేదికపై విద్యార్థులకు జంకు లేకుండా మాట్లాడడం అలవడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేశం, శారద, మంజుల నరసయ్య, కిరణ్ కుమార్, అనిల్ కుమార్ పాల్గొన్నారు

ఆలయ అభివృద్ధికి విరాళం

కొడిమ్యాల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయ అభివృద్ధికి మారుపాక గ్రామానికి చెందిన పెరంగాని ఎల్లయ్యమల్లవ్వ దంపతులు 25వేల116 రూపాయల నగదును ఆలయ పూజారి నాగరాజు రమేష్‌కు గురువారం అందించారు. ఆలయ అభివృద్ధికి విరాళం అందించిన దాత కుటుంబానికి ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు, గ్రామస్తులు కృతజ్ఞతలు తెలిపారు.

సంక్షిప్త సమాచారం

బీర్‌పూర్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని జిల్లా ప్రజాపరిషత్ ఉన్నత పాఠశాలలో మధ్యాహ్న భోజనం సరిగ్గా లేదని విద్యార్థులు ఆరోపించారు. వంటకంలో ఉప్పు బదులు సర్ఫ్ వేసి వంటలు చేశారని కొంత మంది విద్యార్థులు ఆరోపించారు. విషయం తెలుసుకున్న విద్యాధికారి నాగభూషణం, పోలీస్ సిబ్బంది, రెవెన్యూ పరిశీలకులు రాహుల్‌లతో మరి కొంతమంది నాయకులు పాఠశాలకు చేరుకొని భోజనాన్ని తిని చూశారు. వంటలో సర్ఫ్ వేశారనేది అవాస్తవమని, పప్పులో పాలకూర ఎక్కువ మోతాదులో వేయడం వలన తినలేకపోయారని అధికారులు, నాయకులు తెలిపారు. విద్యార్థులు, తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు.

మెట్‌పల్లి టౌన్ : పట్టణంలోని జడ్పీ హెచ్ఎస్ పాఠశాల శిథిలవస్థకు చేరుకున్నందున్న నూతన భవనం మంజూరు చేయాలని కోరుతూ గురువారం డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు ఎండి అవేజ్ హైదారాబాద్‌లో వినతి పత్రం అందజే శారు. .

మల్యాల: సమగ్ర ఇంటింటా కుటుంబ సర్వే ముగియడంతో వాటి వివరాల నమోదుపై గురువారం కంప్యూటర్ ఆపరేటర్లకు శిక్షణ ఇచ్చారు. వివరాలను పారదర్శకంగా తప్పులు లేకుండా నమోదు చేయాలని ఎంపీడీవో స్వాతి సూచించారు. వివరాల నమోదులో ఏమైనా ఇబ్బందులు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని అన్నారు. ఎంపీవో ప్రవీన్ ఎన్యుమరేటర్లు, ఆపరేటర్లు పాల్గొన్నారు.

పెగడపల్లి : సమగ్ర కుటుంబ సర్వేలో సేకరించిన కుటుంబాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు ప్రక్రియ సక్రమంగా నిర్వహించాలని పెగడపల్లి ఎంపీడీవో ఎ.శ్రీనివాస్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వే మండలంలో పూర్తి కాగా గురువారం ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసే కార్యక్రమాన్ని ఎంపీడీవో శ్రీనివాస్‌రెడ్డి ప్రారంభించారు. మండలంలోని 23 గ్రామాలలో 15154 కుటుంబాలకు గాను 25 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను కేటాయించి 15 కంప్యూటర్లు ఆమర్చి డాటా ఎంట్రీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీవో మహేందర్, పంచాయతీ కార్యదర్శులు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

● మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో తొమ్మిదవ తరగతి చదువుతున్న రాచకొండ రాహుల్ పాఠశాలల రాష్ట్రస్థాయి ఖోఖో పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల ఫిజికల్ డైరెక్టర్ రమేష్ తెలిపారు. ఈ నెల 23,24,25 తేదీలలో హైదరాబాద్‌లో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొననున్నట్లు తెలిపారు.